

జి.వి.ఎన్. రాజు

# ఉపన్యాస కళ

ఉత్తమ వక్తగా ఎదగడానికి ఉన్నత ప్రమాణాలు

జి.వి.ఎన్. రాజు

# ఉపన్యాస కళ

ఉత్తమ వక్తగా ఎదగడానికి ఉన్నత ప్రమాణాలు

రచన

**జి.వి.ఎన్.రాజు**

**ఉపన్యాసకళ**
ఉత్తమ వక్తగా ఎదగడానికి ఉన్నత ప్రమాణాలు

రచన : **జి.వి.ఎన్.రాజు**

ప్రథమ ముద్రణ :
మార్చి 2012

డి.టి.పి :
**లక్ష్మీ శ్రీనివాస్,** 9885021639

ముద్రణ :
**హిమాలయ గ్రాఫిక్స్,**
చిక్కడపల్లి, హైదరాబాద్.

ప్రతులకు :
**శ్రీచందన, పబ్లిషర్**
Director, ICON HRD Training
14-28, P & T Colony, Hyd - 60
Email - iconhrd@gmail.com

**విశాలాంధ్ర బుక్ హౌస్,**
అబిడ్స్, హైదరాబాద్.
ఫోన్: 24744580

**ఎ.ఎ. హుస్సేన్ & కో**
5-8-551, ఆబిడ్స్ రోడ్,
హైదరాబాద్-1, ఫోన్: 2320 3724

**మైండ్స్ బుక్ స్టోర్స్**
తనిష్క్ బిల్డింగ్ పైన, దిల్‌సుఖ్‌నగర్,
హైదరాబాద్.



# అంకితం

నేను రచించిన "ఉపన్యాసకళ" అనే పుస్తకాన్ని పూజ్య గురుదేవులు పద్మశ్రీ డా॥ నేరెళ్ళ వేణుమాధవ్‌గారికి వినమ్రతతో అంకితం చేస్తున్నాను. భగవంతుడు నాకిచ్చిన వరం "మా గురువుగారు". కళని ఎంత ప్రేమతో నేర్పించారో, నామీద పుత్రవాత్సల్యంతో అంతే ప్రేమను చూపుతూ ఎన్నో విషయాలలో నాకు మార్గదర్శకులయ్యారు. తన శిష్యులను పుత్ర వాత్సల్యంతో మాత్రమే కాక "తన సహచరులు" అనే భావనతో చూసి వారిని అభినందించడం, వారి ఎదుగుదల చూసి ఆనందించడం, ఆదుకోవడం ఆయన నిండు హృదయానికి నిలువెత్తు సాక్ష్యం. అలాంటి దీవెనలు మిగతా వారి కంటే నాకు ఎక్కువ లభించాయని విశ్వసిస్తున్నాను. ఒక కళాకారుడిగా నేను ఎన్నో కంఠాలను వారి అనుకరణ చూసి నేర్చుకొన్నాను. కొన్ని కంఠాల అద్భుత ప్రసంగ శైలి విని ఆ వక్తలను భౌతికంగా చూడాలనిపించేలా స్ఫూర్తి కలిగించేవారు.

వారి సమయపాలన, మాటకు కట్టుబడి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం, వ్యక్తులను అంచనా వేయడంలో తగినంత సూక్ష్మ పరిశీలన, ఎదుటివారిని అర్థం చేసుకోవటం, చెప్పిన వాటిని తాను ఆచరించి చూపడం, సామాన్యంగా ఉంటూ అసామాన్యంగా వ్యవహరించే సౌజన్యశీలికి హృదయపూర్వకంగా అంకితమిస్తూ వారికి పాదాభివందనం గావిస్తూ, దీవెనలను కోరుకుంటున్నాను.



# స్ఫూర్తి ప్రదాత

గురుతుల్యులు పూజ్యులు డా॥ సి.నారాయణరెడ్డిగారి అద్భుత ప్రసంగ శైలి, వాక్పతిమ, సృజనాత్మక పదప్రయోగాలు, ఒకే విషయాన్ని ఒకే రోజు వివిధ సందర్భాల్లో మాట్లాడినప్పుడు వారి వైవిధ్యభరితమైన ప్రసంగాలు, అసాధారణ ధార, ఎందరినో సమ్మోహితులను చేసినట్లుగానే, నేను వారి ప్రసంగాలకు దాసోహమైనాను. ఈ శతాబ్దపు గొప్పకవిగా మాత్రమేకాక అత్యుత్తమ వక్తగా ముద్రపడిన అసాధారణ ప్రతిభామూర్తి, జ్ఞానపీఠాన్ని అధిష్టించిన పూజ్యులు. అటు తెలుగులోను, ఆంగ్లములోను చేసిన తమ ప్రసంగాలను విని, సినిమా పాటలు, గజల్స్ విని స్ఫూర్తి చెందిన వాడిని. గత 30 ఏళ్ళుగా వారిని మౌనంగా గమనిస్తూ వక్తగా నన్ను నేను తీర్చిదిద్దుకుంటున్నాను.

వేల సంవత్సరాల క్రితం ఒక ఉత్తమ ఉపన్యాసకునికి ఉండాల్సిన లక్షణాలను గురించి ప్లేటో అన్న మాటలు. ‘‘న్యాయ వాదికి ఉండవలసిన జ్ఞాపకశక్తి, ఓ నటుడికి ఉండవలసిన అభినయం, వాక్పటిమ, ఓ కవికి ఉండవలసిన సృజనాత్మకత, భాషా పటుత్వం, ధార, ఓ గాయకుడికి ఉండవలసిన కంఠం’’. ఈ సుగుణాలను పుణికి పుచ్చుకున్న సరస్వతీ పుత్రులు పూజ్యులు డా॥ సి.నారాయణరెడ్డిగారు. ఉపన్యాస కళ మీద నేను వ్రాసిన మొదటి ఆంగ్ల పుస్తకాన్ని పద్మవిభూషణ్ డా॥ సి. నారాయణ రెడ్డిగారికి అంకితం ఇవ్వడం, వారు ఆ కృతిని స్వీకరించి ఆశీస్సులు అందజేయడం నా అదృష్టంగా భావిస్తున్నాను.




# అభినందనలు

అనతి కాలంలోనే ఆత్మీయతతో ఆకట్టుకున్న మిత్రులు శ్రీ జివిఎన్ రాజు మా సంస్థలో వారందరికీ వారి శిక్షణా శిబిరం ద్వారా సుపరిచితులు. తన అనుభవంతో, అసలైన శిక్షణా విధానంతో సుశిక్షితులుగా తీర్చిదిద్ది, ఆత్మస్థైర్యం నింపి, అనవసరమైన అపోహలను తీసివేసి, కార్యక్రమంలో శిక్షణ పొందినవారిని విజయపథం వైపు నడిపించడానికి దోహదపడిన శ్రేయోభిలాషికి చేరువ కావాలని, మా వంతు సహకారాన్ని ఎల్లప్పుడు అందిస్తూ ఉంటామని, ఇలా మరిన్ని చక్కటి పుస్తకాలను రచించాలని ఆకాంక్షిస్తున్నాను.

Sri Abhaya Group

మీ

**కూకట్ల శ్రీనివాస్**

చైర్మన్

**శ్రీ అభయా గ్రూప్స్**

# కృతజ్ఞతలు

నా చిన్నతనంలో మాట్లాడుతున్నప్పుడు, చదువుతున్నప్పుడు వచ్చిన కొన్ని భాషా దోషాలను, చదువుతున్న తీరులోని లోపాలు సరిచేసిన నా మాతృమూర్తికి, ఆంగ్లాన్ని సరిగ్గా పలకమని ఆంగ్ల వ్యాకరణాన్ని దగ్గర ఉండి చెప్పి చదవమని చెప్పిన మా నాన్నగారికి ఆజన్మాంతమూ ఋణపడి ఉంటాను. "ఆచార్యదేవోభవ" అన్నట్లు నా పాఠశాల దశలో నాలోని ప్రతిభను బయటకు లాగి, ప్రోత్సహించిన మా గురువుగారు బుర్రకథా రచయిత, నాటక దర్శకులు స్వర్గీయ కావేరి గోపయ్యగారు. నా మొదటి ఉపన్యాసం ఆంగ్లంలో వారే స్వయంగా వ్రాసి ఇచ్చి ఎలా చెప్పాలో, రెండురోజులు నాతో సాధన చేయించి, నన్ను ఉపన్యసించేలా ధైర్యాన్ని నింపినందుకు సదా కృతజ్ఞుణ్ణి. అలాగే అటు కళలలోను, చదువులోను ప్రోత్సహించిన మా ప్రధానోపాధ్యాయులు స్వర్గీయ నెల్లుట్ల శ్యామసుందర్ గారిని జీవితంలో మరువలేను.

నా భాషకు పదును పెట్టడానికి, నేను సరియైన వాక్కులు పలకడానికి ఎంతగానో ఉపయోగపడిన ఆకాశవాణికి ఎప్పటికీ కృతజ్ఞుణ్ణి. నన్ను ఎంతోకాలం కవితలు వ్రాయమని, ప్రసంగాలు చదవమని, సంధానకర్తగా వ్యవహరించమని అవకాశం కలిగించిన పెద్దలు శ్రీ అరుణాచలంగారికి, ప్రోత్సహించిన శ్రీ జీడిగుంట రామచంద్రమూర్తి, శ్రీ ఇలియాస్ అహమ్మద్, శ్రీ మట్టపల్లి, శ్రీ రాజగోపాల్, శ్రీమతి తురగా జానకిరాణి, శ్రీ మురళీకృష్ణ, డా॥ వి.వి.రామారావు, శ్రీ కృష్ణమాచారిగార్లకు సదా కృతజ్ఞుణ్ణి.

పత్రికలో వ్రాయడానికి ప్రోత్సహించిన డా॥ పోతుకూచి సాంబశివ రావుగారికి, కీ॥శే॥ మహాకవి కాళోజీగారికి, శ్రీ బ్నింగారికి, అప్పటి ఉదయం సిటీడెస్క్ ఎడిటర్, ఇప్పటి ఉద్యోగసోపానం ఎడిటర్ శ్రీ సురేష్‌గారికి సదా కృతజ్ఞతాభివందనాలు.

నా శిక్షణ శిబిరాలను, ఉపన్యాసాలను ఎన్నోసార్లు వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మిత్రులు శ్రీ యార్లగడ్డ సత్యనారాయణ, చైతన్య ఆర్ట్స్ శ్రీ కె.కె.రాజా, శ్రీ వాసిరెడ్డి సతీష్, శ్రీ ఎమ్.శ్రీనివాస్ మేనేజింగ్ డైరెక్టర్-ఏజిస్, శ్రీ శ్రీనివాస్ ఇ.డి. ఏజిస్, డా॥ శేషభటార్ రవి, డా॥ ఎస్.రఘు, శ్రీ గంది చంద్రశేఖర్, శ్రీ గంపా నాగేశ్వరరావు, శ్రీ శ్రీనివాస్ మేనేజింగ్ డైరెక్టర్ - అభయగ్రూప్స్, జెసీ.విశ్వనాధ్ (రాజమండ్రి జెసీస్) గార్లకు కృతజ్ఞుణ్ణి.

జూనియర్ ఛేంబర్ ఇంటర్నేషనల్ (ఇండియన్ జెసీస్) అంతర్జాతీయ వ్యక్తిత్వ అభివృద్ధి సంస్థకు నేను ఎంతగానో ఋణపడి ఉంటాను. ఈ సంస్థలో శాస్త్రీయమైన శిక్షణను పొంది, ఉన్న అభిరుచికి ఎన్నో మెరుగులు దిద్దుకొని వక్త నుంచి వ్యక్తిత్వవికాస శిక్షణా నిపుణుడిగా ఎదగడానికి దోహదపడి నా జీవితాన్ని పూర్తిగా మార్చివేసి, నా భవిష్యత్ దిశను నిర్దేశించింది అని చెప్పడానికి ఆ సంస్థలో పూర్వ సభ్యుడిగా ఉన్నందుకూ గర్వపడుతున్నాను.

జేసీ సంస్థలోని గొప్ప శిక్షకులుగా, అంతర్జాతీయ ప్రసిద్ధిగాంచిన జె.సి. సునీల్‌కుమార్, జె.సి హరీందర్‌సింగ్, జె.సి రాజాగోవిందస్వామి, జె.సి రమేష్ భటావియా, జె.సి డా॥ గణేష్ శాస్త్రి లాంటి ఉద్దండుల చేతుల మీద సుశిక్షితుడయినందుకు ఆనందపడుతూ వారికి సదా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

నన్ను ఈ రంగంలో ప్రోత్సహిస్తున్న హితులు - సన్నిహితులు- శ్రీ కూచిభొట్ల ఆనంద్, శ్రీ వి.వి.సత్యనారాయణరెడ్డి, శ్రీ ఎన్. లక్ష్మీ నారాయణ, శ్రీ కె.విశ్వేశ్వరశాస్త్రి, శ్రీ జగ్‌మోహన్‌సింగ్, శ్రీ మదన్ మోహన్‌రాజు, శ్రీ తురగా వెంకట సుబ్రహ్మణ్యం, శ్రీ రాజేంద్రప్రసాద్, శ్రీ రవిభవిరి, శ్రీ దాసరి వెంకటరమణ, శ్రీ షేక్ బడేసాహెబ్, శ్రీ సుబ్బరాజు బి.వి.ఆర్, శ్రీ బి.వి.ఎస్.నగేష్ గార్లకు, సద్విమర్శలు చేస్తూ, వ్రాయడానికి

ఎంతో సహకరిస్తున్న నా సతీమణి శ్రీచందనకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతాభివందనాలు.

నన్ను ఎంతగానో ప్రోత్సహిస్తున్న కిన్నెర రఘురామ్‌గారికి, ఈ పుస్తకాన్ని కిన్నెర ఆర్ట్స్ ద్వారా పుస్తకావిష్కరణ గావిస్తున్నందుకు కిన్నెర అధ్యక్షులు శ్రీ ఆర్.ప్రభాకర్‌రావుగారికి హృదయపూర్వక అభినందనలు. డి.టి.పి ద్వారా చక్కటి లేఅవుట్ అందచేసిన శ్రీమతి లక్ష్మీ శ్రీనివాస్‌గారికి, హిమాలయ గ్రాఫిక్స్‌కి కృతజ్ఞతలు. చక్కని ఛాయాచిత్రాలు (ఫోటోలు) తీసిన ఎఫ్-16 రాజగోపాల్‌గారికి, సురేష్‌గారికి కృతజ్ఞతలు.

**- జి.వి.యన్. రాజు**

# ఉపన్యాస కళ- పూర్వ వైభవం

ఉపన్యాస కళ గ్రీకు దేశంలో మొదటగా వేళ్ళూనింది అని చెప్పడానికి ఎన్నో నిదర్శనాలు ఉన్నాయి. పశ్చిమ దేశాల్లో ఆధునిక నాగరికత సంతరించుకొంటున్న సమయాల్లో వాక్పటిమ-ఉపన్యాస కళలపై ఎక్కువ శ్రద్ధని కనబరుస్తూ ఈ కళ యొక్క అభివృద్ధికి గ్రీకులు ఎంతగానో కృషి చేశారు. అదే విధంగా భారతదేశంలో కూడా అద్భుత వాక్పటిమకు, అవధానాలకు, ఉపన్యాసాలకు మనవారు చాలా పెద్దపీట వేసారు. వివేకానందుడి అద్భుత ఉపన్యాస పటిమశైలి ఖండాంతరాల నుంచి వచ్చిన వారి ప్రశంసలు అందుకోవడం ఇందుకు ఒక ఉదాహరణ.

ఉపన్యాసకళను ఆధునిక, శాస్త్రీయ పద్ధతులలో బోధించడానికి కృషిచేసిన మహనీయులలో మహిళలు ఉన్నారు. గొప్ప గ్రీకు తత్వవేత్త సోక్రటీస్‌కు ఉపన్యాస కళలో మెళకువలు నేర్పిన మహిళ ఏస్పేషియా. సోక్రటీస్ శిష్యులలో ఎంతో పేరు ప్రఖ్యాతులు గాంచిన ప్లేటో ఎంతోమంది శిష్యులకు ఉపన్యాస కళలో శిక్షణ ఇవ్వగా, ప్లేటో శిష్యరత్నం అరిస్టాటిల్ ఉపన్యాస కళమీద 2000 సంవత్సరాల క్రితం వ్రాసిన గ్రంథాన్నే ఇప్పటికీ ప్రామాణికంగా తీసుకుంటున్నారు.

సిసిలియన్లు ఉపన్యాస కళను ఒక ప్రత్యేక పాఠ్యగ్రంథంగా మలిచి దీని అభివృద్ధికి మరింతగా తోడ్పడటానికి ఒక బలమైన కారణం ఉంది. సిసిలియన్లు ప్రతి విషయంతో "ఏదో ఒకరకంగా గొడవపడే" నైజం, ప్రతి విషయానికీ కోర్టులను సంప్రదించడంతో

దేశంలో ఉన్న (న్యాయవాదులు) సరిపోలేదు. అప్పుడు ఏథెన్స్ నగరంలో ప్రజలకు విచిత్రమైన షరతులను కోర్టులు విధించాయి. అదేమిటంటే ఎవరి దావాలను వారే వాదించుకోవాలి. వాటికి న్యాయనిపుణుల సహకారం తీసుకోకూడదు. అంతే, ఒక్కసారిగా ప్రజల్లో బాగా వాదించడం ఎలా? అద్భుత వాక్పటిమని ఎలా పెంచుకోవాలి? దానికి ఉపయోగపడే కోర్సులు, శిక్షణ ఇచ్చేవారిపై జరిగిన అన్వేషణలో ఉపన్యాస కళ శిక్షణ దినదిన ప్రవర్ధమానంగా వెలిగిపోయింది. క్రీ.పూ 427లో లియోన్‌థిన్ రాయబారి జార్జియా అద్భుతమైన వక్తగా పేరుగాంచి సిరక్యూస్ నగరానికి చెందిన కోరెక్స్‌తో కలిసి మరికొన్ని ప్రాథమిక సూత్రాలను ఉపన్యాస కళకు చేర్చి, ప్రతి ఉపన్యాసానికి ఆరంభం- మధ్య- ముగింపు ఉండాలని  నిర్దేశించాడు. అలాగే ప్రతి వాదనకు ఆరంభం, పూర్వాపరాలకు సంబంధించిన వాస్తవాలు, వాదనకు సంబంధించిన పత్రాలు, చివరిగా ఏ విధమైన న్యాయాన్ని ఆశిస్తున్నారో పూర్తి వివరణలు పొందుపరచాలని పాఠ్యాంశంలో నిర్ణయించాడు.

క్రీస్తుపూర్వం, క్రీస్తు తరువాత మధ్యకాలంలో ప్రతి క్రిష్టియన్ విద్యార్థి తప్పని సరిగా ఉపన్యాస కళని ఒక పాఠ్యాంశంగా ఎంచుకోవాలనే నిబంధన ఉండేది. అందుకే క్రిష్టియన్ సభల్లో, చర్చల్లో మాట్లాడే వక్తలు ఎంతోమందిని ప్రభావితం చేయడం వలననే మతం ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందినది. దురదృష్టవశాత్తు రానురాను ఈ కళను పెద్దగా పట్టించుకోక, అవసరాన్ని అర్థం చేసుకోలేక మన పాఠశాల నుంచి విశ్వవిద్యాలయాల ద్వారా బయటకు వస్తున్న కోట్లాది విద్యార్థుల్లో పదిమందిలో తమ భావాలను వ్యకీకరించే ఆత్మస్థైర్యంగాని, వాక్పటిమ గాని లేక అటు ఇంటర్వ్యూలలోను ఇటు పదవులలోను పెదవి విరుస్తున్నారు.

# ఉపోద్ఘాతము

మంచి వక్తలు తమ ఉపన్యాసాల ద్వారా ప్రజల హృదయాలలోకి అతి త్వరగా చేరువ అవుతారు. అంతవరకు పరిచయం లేని ప్రేక్షకులు, వక్త మధ్య తెలియని అవినాభావ సంబంధం ఏర్పడుతుంది. అభిమానం పెరుగుతుంది. ఇంత త్వరగా ప్రజల గుండెల్లో గూడు కట్టుకోవడం, అకట్టుకోవడం, ప్రసంగికుని వాక్పటిమ, అద్భుత శైలి, అవగాహన అని వేరేగా చెప్పాల్సిన అవసరం లేదు. గాంధీజీ, నేతాజీ, జవహర్‌లాల్, సర్దార్ వల్లభాయి పటేల్, మౌలాన అబ్దుల్ కలామ్ ఎలాంటి అద్భుత ప్రసంగాలు చేస్తే  స్వాతంత్ర్య సమరంలో లక్షలమంది జేజేలు పలికారో, ఎంతమంది వెంట నడిచారో మనకు తెలిసినదే. ఆధ్యాత్మిక ప్రసంగాల ద్వారా ప్రపంచవ్యాప్తంగా మానవసేవని మాధవసేవగా ఆచరణమార్గంలో పెట్టి, కోట్లమందిని మార్చిన భగవాన్ శ్రీసత్యసాయి, పోప్ జాన్‌పాల్, దలైలామా గురించి మనం విన్నాము, స్వయంగా చూశాము. వీరిలో ముఖ్యమైన అంశం - ఎంత  గొప్పగా ప్రసంగిస్తారో, అంత చిత్తశుద్ధితో ఆచరించి చూపిన మహనీయులు.

వేలాది జనం ముందు ప్రసంగించి, మెప్పించగల విజ్ఞానము, నైపుణ్యం ఉండే వక్తలు వేనోళ్ళ కొనియాడబడతారు. ఈ నైపుణ్యం కలిగి ఉంటే వృత్తిపరంగా న్యాయవాదులు మరింత బాగా కేసులను వాదించగలుగుతారు. ఉపాధ్యాయులు అద్భుతంగా

బోధించ గలుగుతారు. వాణిజ్యరంగంలోని వారు ఉత్తమ వ్యాపారులుగా, శిక్షకులు అత్యుత్తమ శిక్షకులుగా ఎదగడానికి ఉపయోగింపబడుతుంది అనడంలో సందేహం లేదు.

నా మూడు దశాబ్దాల అనుభవంలో ప్రభుత్వంలోనూ, మల్టీనేషన్ కంపెనీలతో, వివిధ రంగాల్లో వివిధ హోదాల్లో పనిచేసి, శిక్షణారంగంలో గత 25 ఏళ్ళుగా వివిధ రంగాలలో ఉన్న ఇంజనీర్లు, డాక్టర్లు, విద్యావేత్తలు, రాజకీయవేత్తలు, శిక్షకులకు, విద్యార్థులకు, ప్రభుత్వ ఉన్నతోద్యోగులకు, మార్కెట్ రంగాలలో ఉన్నత స్థానాలలో ఉన్న ఎన్నో వేల మందికి ఉపన్యాస కళతో పాటు వివిధ అంశాల్లో శిక్షణ ఇవ్వడం జరిగింది.

**వినమ్రతతో కూడిన సూచన**

కనీసం ఇప్పటికైనా పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు ఉపన్యాస కళ అవసరాన్ని అర్థం చేసుకొని అభివృద్ధికి తోడ్పడితే భావిజీవితంలో విద్యార్థులు ఉన్నత భావిభారత పౌరులుగా వారి ఆత్మస్థైర్యాన్ని, ఆత్మగౌరవాన్ని ఇనుమడింప జేయుడానికి దోహదపడిన వారవుతారు. ఈ బాధ్యత తీసుకోవాల్సింది కేవలం ఉపాధ్యాయులే. తమ నుంచి నేర్చుకొని వెళ్ళిన శిష్యులు ఎట్టి పరిస్థితుల్లోనూ జీవితంలో ఓడిపోకుండా గెలిపించాల్సిన నైతిక బాధ్యతను వహించిననాడే అసలైన గురువులుగా, ఆదర్శనీయ మైన గురువులుగా పరిగణించబడి శిష్యపరంపర పాదాక్రాంత మౌతుంది అని చెప్పడానికి నిదర్శనం కొంతమంది విశ్వవిజేతలైన విద్యార్థులే.

# రచయిత

గత 30 సంవత్సరాల అనుభవంతో, ఎన్నో వందల ఉపన్యాసాలు చేసి శిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్న శ్రీ జి.వి.ఎన్.రాజు, కేంద్ర ప్రభుత్వంలో పనిచేసి స్వచ్ఛంద పదవీవిరమణ గావించి, తరువాత అంతర్జాతీయ బహుళజాతి కంపెనీలలో పెద్ద హోదాలలో పనిచేసిన అనుభవం కలదు.

వివిధ పత్రికల్లో కొంతకాలం పాటు వ్యాసాలు వ్రాశారు. ఆకాశవాణి, టీవీల్లో విభిన్నమైన కార్యక్రమాలలో గత 25 ఏళ్ళుగా పాల్గొంటున్నారు. సాంస్కృతిక రంగంలో ధ్వన్యనుకరణ కళాకారుడిగా, వెంట్రిలోక్విస్ట్‌గా సరికొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పారు. తెలుగువారి ఆహ్వానం మేరకు అమెరికా, కెనడా, నేపాల్, థాయిలేండ్ మరియు చైనా దేశాల్లో ప్రదర్శనలు ఇచ్చారు.

వ్యక్తిత్వ వికాస నిపుణుడిగా కొన్ని వందల శిక్షణా శిబిరాలను నిర్వహించారు. ప్రభుత్వరంగ సంస్థలైన తపాలా జీవితభీమా, జీవితభీమా సంస్థ, పోలీసు అకాడమీ, పోలీస్ ట్రైనింగ్ కాలేజ్, డా॥ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో, బ్యాంకింగ్ రంగాలవారికి, మార్కెటింగ్ రంగాలవారికి, అధ్యాపకుల శిక్షణా శిబిరాలు, ఉపన్యాస శిక్షణా శిబిరాలు - ఆయా రంగాలకు తగినట్లు శిక్షణాంశాలను తయారుచేసి, వారిలోని నైపుణ్యానికి పదునుపెట్టి ఆత్మస్థైర్యంతో, అభివృద్ధి పథంలోకి నడిపే మార్గదర్శకులుగా తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు.

# విషయసూచిక

1. అవగాహన ...................... 17
2. అర్ధాంతరం ..................... 18
3. అసభ్యకరం...................... 19
4. అసంకల్పిత చేష్టలు............. 20
5. అంకెలు ........................ 21
6. అభినయము ................... 22
7. అయోమయ స్థితి................ 23
8. ఆరంభం ....................... 24
9. ఆవృత్తం ........................ 25
10. ఆహార్యం ....................... 26
11. ఆకలి .......................... 27
12. ఆలస్యం ........................ 28
13. ఇతివృత్తం ...................... 29
14. ఇరకాటం ...................... 30
15. ఈర్ష్య .......................... 31
16. ఉపోద్ఘాతం .................... 32
17. ఉత్సాహం....................... 33
18. ఉత్సుకత ....................... 34
19. ఉచ్ఛారణ ...................... 35
20. ఉద్ఘాటన ....................... 36
21. ఉదహరించడం................. 37
22. ఊసులు ........................ 38
23. ఊతపదాలు .................... 39
24. ఊకదంపుడు.................... 40
25. ఎబ్బెట్టు ........................ 41
26. ఏమరుపాటు .................... 42
27. ఒంటరిపోరాటం .............. 43
28. కరఘోష ....................... 44
29. కృతజ్ఞతలు ..................... 45
30. కంఠము ........................ 46
31. కళ్ళ నియంత్రణ ................ 47
32. గతి ............................. 48
33. చిరుతిళ్ళు ....................... 49
34. చిరుదరహాసం .................. 50
35. నస ............................. 51
36. నటించవద్దు..................... 52
37. నాడి ............................ 53
38. నిలబడే తీరు (స్థితి) ........... 54
39. నిశిత వీక్షణం................... 55
40. పుస్తకాల పురుగులు ............ 56
41. ప్రక్కదారి మళ్లించడం.......... 57
42. ప్రేరణ........................... 58
43. భయం........................... 59
44. మందకొడి...................... 60
45. 'మైకా'సురులు .................. 61
46. మర్యాద క్రమము ............... 62
47. ముగింపు....................... 63
48. మొబైల్ నియంత్రణ ............ 64
49. మౌనం ......................... 65
50. యదార్ధం........................ 66
51. వందన దండకము ............. 67
52. వ్యక్తీకరణ........................ 68
53. విసిగించటం .................... 69
54. విమర్శలు ....................... 70
55. శృతిమించటం .................. 71
56. స్వర స్థాయి ..................... 72
57. స్వల్ప విరామం................. 73
58. స్థబ్ధఛేదన ........................ 74
59. స్వోత్కర్ష........................ 75
60. సవరించుకోవడం ............... 76
61. సంక్షిప్తత ........................ 77
62. సమయపాలన.................. 78
63. హాస్యం ......................... 79
64. క్షమాపణ ....................... 80

# అవగాహన

మాట్లాడే ముందు ఉపన్యాసకుడికి కావాల్సిన మొదటి లక్షణం అవగాహన. పూర్తి ఆలోచన, సంపూర్ణ అవగాహన లేనియెడల మాట్లాడకుండా ఉండడం అత్యుత్తమం. అందరిని ఆకర్షించడానికి అద్భుతంగా మాట్లాడడానికి మాట్లాడబోయే అంశం, అంకుశంలా సూటిగా పదునుగా ఉంటే ఎంతటి సభనైనా ఉపన్యాస పటిమతో ముందుకు తీసుకువెళ్ళవచ్చును.

అవగాహన లేని వక్తలను వచ్చిన ప్రేక్షకులు, సభికులు గౌరవించరు. మళ్ళీ ఆహ్వానం పలకరు.

*"క్లుప్తతయే ప్రసంగానికి ఉత్తమభూషణం" – సిసిరో*

# అర్థాంతరం

ఉపన్యాసకుడు ఎపుడైతే ఎవరినీ లెక్కచేయకుండా తనకు తోచిన విధంగా మాట్లాడుతూ వెళితే కూర్చున్న శ్రోతలు కేకలు వేసే ప్రమాదం ఉంటుంది.

అవగాహన లేకుండా, సరియైన ప్రణాళిక ప్రకారం మాట్లాడకుండా, ఎదుటి వారిని పరిగణలోకి తీసుకోకుండా అంతా తానే మాట్లాడాలి అనే ఆతృత కలిగిన ఉపన్యాసకుణ్ణి "అర్థాంతరంగా" దించే అవకాశం ఉంటుంది. కావున చాలా జాగ్రత్త పాటించడం, అంశాన్ని సరిగ్గా తయారుచేసుకోవడం, అందర్నీ దృష్టిలో పెట్టుకోవడం ముఖ్యం. ప్రతి వక్తా మాట్లాడబోయే ముందు తాను ఎంత సేపు ప్రసంగించాల్సి ఉంటుందో అడిగి తెలుసుకోకపోవడం వలన కూడా ఇబ్బందులు ఏర్పడవచ్చును. అర్థాంతరంగా ఉపన్యాసాన్ని ఆపివేయడం చాల అవమానకరం.

# అసభ్యకరం

ఉపన్యాసకుని నుంచి ఎంతో నేర్చుకోవచ్చని, ఓ... నాలుగు మంచి విషయాలు తెలుసుకోగలుగుతామని ప్రతి సగటు ప్రేక్షకుడు అనుకుంటాడు. దానికి భిన్నంగా ఏ వ్యక్త అయినా ప్రసంగించిన తీరులో, ఉపయోగించిన పదజాలం అసభ్యకరంగా ఉంటే ప్రేక్షకులు ఆ సభలో ఉన్నందుకే సిగ్గుపడతారు. అసభ్యకరమైన పదజాలం వక్త వ్యక్తిత్వాన్ని తగ్గిస్తుంది.

అసభ్యకరం అంటే కేవలం తిట్లు మాత్రమే కాదు, ఎదుటివారిని సంబోధించే తీరు, వేరే వారిని ప్రస్తుతించే తీరు అగౌరవంగా మాట్లాడటం వంటివి. వాడు, వీడు, ఈమె, ఈయన, అన్నాడు, అన్నది, దాని గురించి, పోటుగాడు, కేటుగాడు, లాంటి పదాలను ప్రసంగిస్తున్న సమయంలో వాడడం అసభ్యమే.

*సారవంతంగా చెప్పడం మంచి వక్త లక్షణం – శ్రీహర్షుడు*

# అసంకల్పిత చేష్టలు

కొంతమంది వక్తలు తాము బాగా మాట్లాడితే చాలు, మిగతా విషయాలు ఏవీ పట్టించుకోవల్సిన అవసరం లేదనుకుంటారు కానీ వారికి తెలియకుండా జరిగే అసంకల్పిత చేష్టలు, వింటున్న వారికి, చూస్తున్న వారికి నవ్వు తెప్పించే విధంగా, ప్రేక్షకులు వక్తను ఎగతాళి చేసే విధంగా ఉంటాయి. కావున తమ ప్రసంగాలను తామే విశ్లేషించుకొని, పునః పరిశీలన చేసుకొని సరిదిద్దుకోవడం చాలా ముఖ్యం.

కొందరికి ప్రతిమాటకు భుజాలు ఎగరవేయటం, ముక్కు నలుపుకోవడం, కళ్ళు రుద్దుకోవడం, ప్రతిసారి చేతులు రుద్దుకున్నట్టు చేయడం, కాళ్ళు ఊపడం, కనుబొమ్మలు ఎగరవేయడం లాంటివి అసంకల్పితంగా జరిగిపోతుంటాయి. అందువలన సరియైన సాధన చేస్తే వీటిని అధిగమించవచ్చును.

# అంకెలు

ఉపన్యాసకులు అవసరమైపన చోట్ల నిష్పత్తులను, శాతం, సరాసరి అంకెలను ఉపయోగించవచ్చును. కానీ సరియైన లెక్కప్రకారం ఉదా: 96,45,36,362 అని చెప్పే బదులు 96న్నర కోట్లు అని చెప్పవచ్చును. ఎక్కువ గణాంకాలను వాడడం వలన ప్రేక్షకులకు చికాకు కలిగిస్తాయే తప్ప చిరునవ్వుని తెప్పించవు.

అందుకే విపరీతమైన అంకెలతో ఉపన్యాసంలో రంకెలు వేసేకంటే సులభమైన రీతిలో అంకెలను ఉపయోగించటం సముచితం. ఉదా:- గత పదేళ్ళుగా స్త్రీ పురుషుల నిష్పత్తి 10:6 ఉంటుంది, బాలికలకంటే బాలురు 18% తక్కువగా ఉత్తీర్ణత ఇలా వాడడం వలన సులభంగా అర్థం అవుతుంది. అందుకే ఉన్న సంఖ్యలన్నీ వరసబెట్టి చెబితే నిజమెంతో ప్రక్కకుబెడితే, అసలు ఎలా సులభంగా గుర్తుంచుకోవాలో తెలియక ఇబ్బంది పడతారు.

*ఉపన్యాసంలో విలువైన భాగాలు విరామాలే – రాల్ఫ్‌రిచర్డ్సన్*

# అభినయము

ఉపన్యసిస్తున్నప్పుడు వక్త తన భావప్రకటనలకు అనుగుణంగా చేతులను, తలను ఊపడం. అలాగే వివిధ రకాలైన ముఖ కవళికల ద్వారా భావాలను ప్రదర్శిస్తే చెప్పాల్సిన విషయాన్ని ఎక్కువగా అభివర్ణించడానికి వీలవుతుంది. అభినయము లేకుండా ఉపన్యసించడం అంటే ఒక చెక్కబొమ్మ మాట్లాడినట్లుగా ఉంటుంది. కొందరు తమకు తాము చేతులు కట్టుకొని, చేతులు వెనుకకు మడుచుకొని, చేతులు జేబుల్లో పెట్టుకొని, చేతులతో మైకును కదలకుండా పట్టుకొని తమకు తామే నియంత్రించు కొంటారు.

మరికొంతమంది ముఖ కవళికలు లేకుండా చాలా గంభీరంగా, ఏదో పొగట్టుకున్నవారిలా, ఆముదము తాగినట్టుగా మొహం పెట్టి ఉపన్యసించడం ద్వారా, సభికులలో ఉత్సాహం పోయి" ఏదో ఖర్మకొద్దీ వినాల్సి వస్తుంది అనుకొని నిట్టూర్పు విడుస్తారు.

# అయోమయ స్థితి

ఉపన్యాసకులు సభికులను అయోమయస్థితిలో పెట్టే వ్యాఖ్యలు చేయకూడదు. రెండు నాల్కల ధోరణి పనికిరాదు. చెప్పాల్సిన విషయాన్ని ప్రస్ఫుటంగానే ప్రస్తుతించాలి. వెటకారం, ద్వంద్వార్థాల మాటలను దరికి జేరనివ్వకూడదు. వింటున్న ప్రేక్షకులకు ఇబ్బందికరమైన రీతిలో ప్రసంగించి వక్తగా ఉన్న గౌరవాన్ని పోగొట్టు కోకూడదు.

విచ్చేసిన సభికులను తక్కువ చేసి మాట్లాడం, లేనిపోని అపోహలు కలిగించి వారికి అర్థంకాని అయోమయ స్థితికి తీసుకువెళ్ళడం భావ్యం కాదు.

*మాట్లాడటం, ఉపన్యాసాలివ్వటం ఒకటి కాదు – బెన్‌జాన్సన్*

# ఆరంభం

ఏ ఉపన్యాసమైనా ఆరంభం, మధ్య, ముగింపు మీద ఆధారపడి ఉంటుంది. ఆరంభం ఎంత గొప్పగా ఉంటే అంత బాగా ప్రేక్షకులు ఉపన్యాసకుడు చెప్పబోయే విషయాలను శ్రద్ధతో ఆలకించడానికి ఉత్సాహం చూపుతారు. ఆరంభం ఆర్భాటంగానే ఉండాలి. ఇది ప్రసంగానికి ప్రధాన ద్వారం. ఉపన్యాసకులు ఎంత బాగా ఆకర్షణీయంగా, ఆప్యాయంగా, ఆవేశంగా, ఆలోచనా పరంగా శ్రోతలను స్వాగతిస్తారో అదే విధంగా ప్రేక్షకులు ప్రతిస్పందిస్తారు.

ఓ చక్కటి సుభాషితం, పద్యం, తాజా వార్త, ఓ ప్రశ్న, చిన్న పిట్టకథ, మాట్లాడబోయే అంశానికి సంబంధించిన పూర్వచరిత్ర, అబ్బురపరిచే విషయాలను ఉపన్యాసారంభంలో చెప్పి ఆ తరువాత ఉపన్యాసాన్ని కొనసాగించవచ్చును.

# ఆవృత్తం

విషయ పరిజ్ఞానంతో పాటు మాట్లాడాల్సినంత మేరకే మాట్లాడడం చాలా ముఖ్యం. సభను అనుసరించి ఎంతవరకు ఏ విషయాలు ఎంత లోతుగా మాట్లాడాలో, ఎంత కుదించి మాట్లాడాలో, ఆవృత్తంలోనే మాట్లాడడం ముఖ్యం. ఆవృత్తం దాటడం వలన వచ్చిన సభికులకు వినే అంశం, చెప్పేవారు వెర్రితలలు వేస్తున్నట్లుగా ఉంటుంది.

అటువంటి ఉపన్యాసకులను వీలైనంత మేరకు పిలవకుండా, "అబ్బో మరీ మేధావులు" మాకొద్దండి అనే అవకాశం ఇచ్చినట్లవుతుంది. అందుకే వక్తలు ఎవరి పరిధుల్లో వారు ఉండాలి.

*నాలుక ఉక్కుకాదు, అయినా అది కోస్తుంది – జాన్‌హేఉడ్*

# ఆహార్యం

సహజంగానే ప్రేక్షకులదృష్టి ఉపన్యాకుడి మీద కేంద్రీకృతమౌతుంది. అలాంటప్పుడు ఉపన్యాసకుడు ఎలాంటి దుస్తులు వేసుకున్నాడు, ఎలా కనపడుతున్నాడు అనే విషయం చర్చనీయాంశం కాకూడదు. అంటే సభా విశేషాన్ని అనుసరించి తగిన దుస్తులు వేసుకోవడం చాలా ముఖ్యం.

ఆధ్యాత్మికసభలు, సాంస్కృతిక సభలు, సంతాప సభలు, రాజకీయ సభలు... ఇలా వేటికి తగ్గట్టుగా వాటి దుస్తులను వేసుకోవడం మంచి ఆలోచన. కొందరికి పెద్దవయసు రీత్యా ఎక్కడికి వెళ్ళినా ఒక రకమైన దుస్తులే నప్పుతాయి. ప్రజలకీ అలవాటు అయిపోతుంది. వీలైనంత వరకు ముదురురంగు దుస్తులను వాడకపోవడం మంచిది.

# ఆకలి

ఆకలిగొన్న వక్తలు పూర్తి వాక్యాలను పూరించరు. ఎన్నో పదాలను ఆకలిగొన్నట్లు మ్రింగేస్తారు. దానికి కారణం భాషమీద పూర్తి పటుత్వం లేకపోవడం వలన. మరొకటి భయం, ఆతృత చోటుచేసుకున్న వక్తల మాటలలో కూడా పూర్తి వాక్యాలు సభికులకు వినబడవు.

సరియైన పదాలు దొరకనప్పుడు, పదాలను ఎలా వాడాలో తెలియనపుడు, పదాలను అలా ఓసారి స్ఫురణకు తెచ్చినట్లు తెచ్చి మళ్ళీ ఆ ఊసే ఎత్తరు. ఆ విధంగా ప్రసంగించడం వలన వాక్యాలు పూర్తిగా వినబడకపోవడమే కాదు, అర్థం కూడా పూర్తిగా రాదు. అందుచేత వాడే పదాల అర్థం తెలుసుకోవటం ముఖ్యం. అంతేకాని వేరే వారు వాడిన పదాలను కాపీ కొట్టి ఎలా మాట్లాడాలో తెలియక అభాసుపాలు కాకూడదు.

*చక్కగా ప్రసంగించడం, ఆత్మ విశ్వాసానికి నిదర్శనం – జె.విలియం*

# ఆలస్యం

కొందరు వక్తలు సభకు ఆలస్యంగా రావడం తమ హోదా అనే భ్రమలో ఉంటారు. మరికొందరు నేను ప్రసంగించేవారిలో మొదటివాడిని కాదు కాబట్టి ఆలస్యంగా వెళ్ళినా ఫరవాలేదు అనుకుంటారు. ఆలస్యంగా రావడం వలన వక్తలకు క్రమశిక్షణ లేదని, విచ్చేసిన సభికులందరికీ - తెలిసిపోతుంది. కొందరు చాలా అమాయకంగా కుంటిసాకులు చెప్పడానికి ప్రయత్నిస్తారు. అయితే అసలు నిజాన్ని ప్రజలు అర్థం చేసుకుంటారని గమనించాలి.

ఆలస్యంగా వెళ్ళటం ఒక చెడు అలవాటు. ప్రమాదం గాని, ఆసుపత్రిలోనున్నవారి దగ్గర నుంచి రావడం మినహాయిస్తే మిగతావన్ని తమకు తాముగా, ఏ సమయానికి రావాలో దాని ప్రకారం అనుకొని వచ్చినదే. ఉపన్యాసకులు ఎట్టి పరిస్థితిలో ఆలస్యంగా వెళ్ళడం సబబు కాదు.

# ఇతివృత్తం

ప్రసంగంలో ఇతివృత్తాన్ని ప్రస్తుతించడం మంచిదే కానీ మోతాదు మించకూడదు. ఇతివృతాన్ని తీసుకుని, నెమరు వేసుకోవడం వలన ఉపన్యాసకుడికి, వింటున్న శ్రోతకి సంపూర్ణంగా వివరించే అవకాశం, వినే అవకాశం కలుగుతుంది.

ఏ విషయం మాట్లాడటానికైనా ఇతివృత్తం చాలా ముఖ్యం. కొన్ని ఇతివృత్తంపై ఆధారపడి చర్చించే అవకాశం, తీసుకోబోయే నిర్ణయాలు, ముందస్తు ప్రణాళికలను, ఆలోచనలనీ ప్రసంగీకుడు ప్రస్తావించడం వలన ప్రసంగించే విషయానికి పూర్తి బలం చేకూరుతుంది.

*విషయంపై పూర్తి అధికారం, అవగాహన కలిగివుంటే మహావక్తగా ఎదగడం సులభం*

*– తుకారాం*

# ఇరకాటం

కొంతమంది ఉపన్యాసకులు మాట్లాడబోయే ముందు అతి వినయంగా, నాకు ఈ సభలో మాట్లాడేంత అర్హత లేదు. "అంత గొప్పవాణ్ణి కాదు", ఈ సభలో ఉన్న వారిముందు నేనెంత?" ఇలాంటివి మాట్లాడి పిలిచిన నిర్వాహకులను ఇరకాటంలో పెట్టకూడదు. ఈ విధంగా మాట్లాడడం వలన కూర్చున్న ప్రేక్షకులు కూడా వినాలా? వద్దా? అన్న ఇరకాటంలో పడతారు.

కావున ఇలాంటివి సభలో ప్రసంగించే ముందు మాట్లాడకపోవడం 'మంచిది'. శ్రోతలు ఉపన్యాసకుణ్ణి వినడానికే వస్తారు కాని ఇలాంటి విషయాలు వినడానికి కాదు. ఒక వేళ వక్తగా మీకు అలా అనిపించినట్లయితే మీ పూర్తి ప్రసంగం అయిపోయిన తరువాత ముగింపులో అంటే కొంత అర్థం ఉంటుంది.

# ఈర్ష్య

ఉపన్యాసకులకి తొందర పనికిరాదు. కొందరు తెలివిగా మిగతావారు మాట్లాడిన తరువాత మాట్లాడితే తనకు మాట్లాడానికి ఏమి ఉండదని భావించి ముందుగా అన్ని విషయాలు మాట్లాడే ప్రయత్నిస్తారు. కానీ ప్రేక్షకులు ఇది తేలికగా గమనించగలరు. నిజమైన వక్తకి ఏ విషయాన్ని ఎలా చెప్పాలో, ఒకవేళ చెప్పేసిన విషయాన్ని వేరే కోణంలో ఎలా ఆవిష్కరించాలో బాగా తెలుసు.

విషయపరిజ్ఞానం లేని వాళ్ళు మాత్రమే ఈర్ష్యతో త్వరగా మాట్లాడాలని, ఏదో పనిమీద వెళ్ళిపోతున్నామని చెబుతూ అక్కడే కూర్చున్న వాళ్ళు ఉన్నారు " "స్పర్థావర్థతే విద్యా!" అన్నట్లు మరింత భిన్నంగా ఒకరిని మించి ఒకరు మాట్లాడడానికి చూడాలి కాని ఈర్ష్యతో ముందుగా మాట్లాడడం వలన మంచి విషయాలు కోల్పోవచ్చు, సరిగ్గా మాట్లాడలేకపోవచ్చు.

*ప్రసంగం యొక్క పరమావధి నచ్చచెప్పడమే కాని సత్యాన్వేషణ కాదు.*

– మెకాలే

# ఉపోద్ఘాతం

ఉపోద్ఘాతం బంగాళాఖాతం అంత ఉండకూడదు. ఉపన్యాసకుడు వీలైనంత త్వరగా ప్రేక్షకులకి తనకి మధ్యన వారథి ఏర్పరచుకోవాలి. అసలు విషయానికి రావాలి. ఎక్కువ ఉపోద్ఘాతం వినడానికి ప్రేక్షకులు సిద్ధంగా ఉండరు సరికదా... "నీ ఉపోద్ఘాతంం వినడానికి రాలేదోయ్" చెప్పాల్సింది త్వరగా విన్నవించు అని మనసులో అనుకుంటారు.

ముఖ్యంగా ఉపన్యాసాలలో ఉపోద్ఘాతం అంత ఎక్కువగా అవసరం ఉండదు కాని ప్రాముఖ్యత నివ్వాలి. వీలైనంత త్వరగా పూర్తిచేయాలి.

# ఉత్సాహం

వక్త ఏ విషయాన్నయినా ఉత్సాహంగా మాట్లాడాలి. వినే ప్రతి ఒక్క ప్రేక్షకుడికీ తన హృదయంతో వారి కోసమే మాట్లాడుతున్నాడనే భావన కలగాలి.

భావప్రకటనను తన కంఠంలో నింపుకొని, వక్త ఉత్సాహంతో మాట్లాడుతున్నప్పుడు ప్రతి సభికుడూ మరింత ఆనందానికి గురి అవుతాడు. ఉత్సాహం నింపని ఏ ఉపన్యాసమైన పేలవంగా ఉండి మనసులో చోటు సంపాదించుకోదు.

ఆ ఉత్సాహం ఆరంభం నుంచి ముగింపు దాకా కొనసాగితేనే ఉపన్యాసం రక్తి కడుతుంది.

*ప్రజలకు అతి సులువుగా, చేరువ కావడానికి ఉపన్యాసం తోడ్పడుతుంది.*

# ఉత్సుకత

ఎటువంటి ఉపన్యాసకునికైనా వింటున్న ప్రేక్షకులను తన వైపు త్రిప్పుకోవడం, తనను వినేలా చేసుకోవడం చాలా ముఖ్యం. ఇది కొంతవరకు కత్తిమీద సాము లాంటిది అని తెలుసుకోవాలి. వివిధ అంశాలు ఎంపిక మేరకు ఆయా సమయాలను అనుసరించి, ఏ విషయం మాట్లాడితే ఆ తరుణంలో ప్రేక్షకులు ఉత్సాహంతో ఉత్సుకతను చూపుతారో వాటిని ఎంచుకోవాలి. ఇక్కడ కొన్ని విషయాలు గ్రహించాలి.

ఉపన్యాసకుడు ఎవరితో ఏ సందర్భంలో మాట్లాడబోతున్నాడో వాటికి సంబంధించినవి మాట్లాడటం యోచితం. మొదటి 60-120 సెకండ్లలో వక్త ఈ ఉత్సుకతను రేకెత్తించకపోతే, సభికులు వినడానికి అంతగా ఉత్సాహం చూపరు. ఈ మొదటి రెండు నిమిషాలు చాలా విలువైనవని గుర్తించాలి.

# ఉచ్చారణ

ఉపన్యాసంలో వక్త భాషోచ్చారణ తన విలువను పెంచుతుంది. ఏ భాషలో మాట్లాడినా ఆ భాషకు సంబంధించిన ఉచ్చారణను సరిగ్గా ఉచ్చరించడం చాలా ముఖ్యం. తెలుగు భాషలో ముఖ్యంగా దీర్ఘాలు, ఒత్తులు, దంత్యములు, తాళవ్యాలు సరిగ్గా పలకాలి. వీటిని తేలికగా తీసుకునే వక్తలను, సరియైన విధానంలో ఉచ్చరించని వారిని జనం అక్కడే ఎగతాళి చేస్తారు.

అలాగే వక్తలు వేరే భాషకు సంబంధించిన సుభాషితాలు, కవితలను వర్ణించినపుడు ఆ భాషలోని సరియైన ఉచ్చారణ తెలుసుకొని, నేర్చుకొని ఉపన్యసించడం చాలా ముఖ్యం. అటు పూర్తి గ్రాంధికముగా లేదా పూర్తి వ్యావహారిక భాషలో మాట్లాడినా ప్రమాదమే. అందుచేత వక్తలు  సరియైన పద్ధతిలో ఉచ్చరించే తీరును అలవాటు చేసుకోవాలి. అందుకోసం వార్తాపత్రికలు, పుస్తకాలను చదవటం, గొప్ప వక్తల ప్రసంగాలు వినడం వలన సరియైన పద ఉచ్చారణనను నేర్చుకోవచ్చును.

*మనుష్యులు అత్యంత భయానికి లోనయిన సందర్భాల్లో మొదటిది వేదిక మీద నుండి ఉపన్యసించడం, రెండవది అతి ఎత్తయిన ప్రదేశాల నుంచి క్రిందకు చూడటం, మూడవదిగా మృత్యువుగా నమోదు కాబడినది. – 1954లో జెరీసిన్‌ఫీల్డ్*

# ఉద్ఘాటన

వక్తలు ముఖ్యమైన అంశాలను ప్రస్తుతించేటపుడు తప్పనిసరిగా వాటిని నొక్కి వక్కాణించడం ముఖ్యం. కీలక అంశాలను ఉద్ఘాటించడం వలన వినే సభికులకు ఎక్కువగా గుర్తుండటానికి వీలుంటుంది. అదే విధముగా ఎక్కడైతే ప్రతిస్పందన ఆశిస్తారో, ఎపుడయితే దృష్టిని కేంద్రీకరించాలనుకుంటున్నారో ఆ సమయంలో ఉద్ఘాటించడం ముఖ్యం.

ఉపన్యాసం ముగింపులో కూడా ప్రధాన అంశాన్ని మరోసారి ఉద్ఘాటించడం వలన అవి సభికులకు విషయ ప్రాముఖ్యతను మరోసారి వివరించినట్లవుతుంది.

# ఉదహరించడం

అతిగా ఉదహరించడం వలన ఉపన్యాసంలో ఉనికి దెబ్బతింటుంది. ఉదాహరణలు తగిన విధంగా ఉండాలి. పోలిక, పొంతనలేని ఉదాహరణలు కొంపలు ముంచుతాయి. ఈ ఉదాహరణలు ఇస్తున్నప్పుడు మాట్లాడే ప్రదేశం, అక్కడ ప్రాంతీయ భాషలను, సంస్కృతిని, వివిధ వర్గాలను దృష్టిలో పెట్టుకొని మాట్లాడం ఎంతో ముఖ్యం.

ఏ ఒక్క ఉదాహరణా ఎవరి ఆత్మగౌరవాలను, సంస్కృతిని దెబ్బతీసే విధంగా ఉండకూడదు. ఉదాహరణలు వీలైనంత తక్కువ సమయంలో ఎక్కువ విషయాన్ని తెలిపేవిగా ఉండాలి. ఒక విషయానికే సంబంధించి రెండు, మూడు ఉదాహరణలు ప్రేక్షకులకు చికాకు కలిగిస్తాయనే విషయం మర్చిపోకూడదు.

*ఉపన్యాసాలు మూడురకాలు. మొదట వక్త తయారు చేసుకున్నది, రెండవది అసలు ఉపన్యసించునది, మూడవది ఉపన్యసించాలనుకొని కోరుకున్నది – డేల్ కార్నిగి, అద్భుతమైన వక్తగా పేరొందిన రచయిత, శిక్షకుడు*

# ఊసులు

కొందరిని ఉపన్యాసకులుగా ఆహ్వానించినప్పుడు వారు ఉపన్యసించినట్లుగా కాకుండా ఏదో ఇద్దరు ముగ్గురుతో మాట్లాడినట్లు ఉంటుంది. ఉపన్యాసం అనేది "సంభాషణ" కాదు. సాగదీయబడిన సంభాషణ అసలేకాదు.

ఉపన్యాసం ఊసులు చెప్పినట్లు ఉండకూడదు. ఉరకలు వేయించే విధంగా, ఉద్వేగాన్ని తెచ్చేదిగా, ఉపన్యాసకుడి ధార ప్రజలు ఆస్వాదించే రీతిలో ఉంటేనే ఉపన్యాసానికి ఉపన్యాసకుడికి విలువ పెరుగుతుంది.

# ఊతపదాలు

ఊతపదాలు వినే శ్రోతలకు విసుగు కలిగిస్తాయి. వీలైనంతవరకు ఉపన్యాసకులు వీటిని గమనించి తమ ప్రసంగంలో రానివ్వకుండా జాగ్రత్తపడాలి. ఉదాహరణ: అని మనవి చేసుకుంటున్నాను, కావున, అంచేత, బహుషా, అన్నమాట, మరీ, సో..., ఆ విధంగా, విన్నవించుకుంటున్నాను.

ఒకోసారి ఒకో ప్రసంగంలో ఇలాంటి పదాలను 10నుంచి 20సార్లు కంటే ఎక్కువగా మాట్లాడిన వక్తలు చాలా వరకే ఉన్నారు.

ఊతపదాలకు మరో కారణం భాషమీద ఎక్కువ పట్టులేక పోవడం వలన, మిగతా ఉత్తమ వక్తలను చూసి నేర్చుకోపోవడం వలన, తనను తాను పూర్తిగా పరిశీలించకపోవడం వలన, అలాగే వేరే వారిని తమ ఉపన్యాసం గమనించి తప్పులు చెప్పమని అడగకపోవడం వలన, వారిని వారు దిద్దుకునే ప్రయత్నం చేయక పోవడం కూడా ఒక ముఖ్యకారణం అని చెప్పుకోవచ్చును.

*ప్రేక్షకులు వినడం ఆపేసే లోపుగానే, వక్త తన ఉపన్యాసాన్ని ముగించడం ముఖ్యం*
*– డోర్థిసెర్నాఫ్ (1914–2008, వ్యక్తిత్వ వికాసనిపుణులు)*

# ఊకదంపుడు

ఊకదంపుడు ఉపన్యాసాలకు కొందరికి పెట్టింది పేరు. ఏమి మాట్లాడుతున్నామో... ఎంత వరకు మాట్లాడాలో, ఎలా మాట్లాడాలో, ఎలా మాట్లాడితే ఆ సభకి రక్తి కడుతుందో తెలియక లేక అనర్గళంగా మాట్లాడి, గొప్పగా మాట్లాడాము అనుకొని అభాసుపాలు అవుతారు. ఎందుకంటే మాట్లాడిన విషయంలో పస లేదు కాబట్టి.

ఊకదంపుడు ఉపన్యాసాలలో చివరికి ఇచ్చిన సందేశమేమిటో వింటున్న ప్రజలకు అర్థంకాక, వక్త ప్రసంగాన్ని ఎక్కడికి తీసుకొని వెళుతున్నాడో తెలియక అయోమయంలో పడతారు. అప్పుడు వారి ప్రతిస్పందన అడిగితే... బాగానే మాట్లాడారు కానీ అసలు విషయం ఏమిటో ఆయనకే తెలియాలి అని చెప్పలేక వదిలేస్తారు. అందువలన ఊకదంపుడు ఉపన్యాసాలను ప్రేక్షకులు ఉపేక్షించరని గుర్తు పెట్టుకోవాలి.

# ఎబ్బెట్టు

కొందరు ఉపన్యాసకులు భాషను పట్టించుకోకుండా వారికి ఇష్టమొచ్చిన రీతిలో మాట్లాడటం సభా మర్యాద కాదు. ఎబ్బెట్టుగా మాట్లాడం వలన సభలోని వారికి, సభికులకూ అనాసక్తి కలిగి అగౌరవంగా భావిస్తారు. ఎబ్బెట్టుగా మాట్లాడం తమను తాము ముందుగా అగౌరపరుచుకోవడమే...

ఉదాహరణకు: ఏకవచన ప్రయోగం, సంబంధంలేని పోలికలతో కూడిన నానుడులు ఉపయోగించడం, ఎద్దేవ చేయడం, సద్విమర్శకు బదులు కువిమర్శలు చేయడం, అసందర్భ ప్రేలాపనలు, చెప్పాల్సిన విషయాన్ని చాలా ఎబ్బెట్టుగా చెప్పడం వలన ప్రేక్షకులు సహనం కోల్పోతారు.

*మూడు గంటల ఉపన్యాసానికి కంటె మూడు నిముషాల ఉపన్యాసానికి ఎక్కువ తయారు కావాలి.*

# ఏమరుపాటు

వక్తలకు ఉండాల్సిన మరో లక్షణం ఏమరుపాటు. తాము ఏ సభలో మాట్లాడుతున్నారో, ఆ సభ యొక్క విశిష్టత ఏమిటి? వచ్చిన ప్రేక్షకులు ఏమి ఆశిస్తున్నారు? ఆహ్వానితులైన ప్రేక్షకులు ఏ వర్గానికి చెందినవారు? ఎలాంటి విషయాలను తన ప్రసంగంలో ప్రస్తుతించాలి?

ఎలాంటి విషయాలు స్పృశించకూడదు? ఎంత వరకు ఆ విషయాన్ని చెబితే బాగుంటుంది? సందర్భాను సారంగా ఉపన్యాసపరంగా ఎలా ప్రవర్తించాలి అనే విషయాల్ని దృష్టిలో ఉంచుకున్నట్లయితే వక్తలకు అభినందనలు లభిస్తాయి. లేదా అవమానాలకు గురికావాల్సి ఉంటుంది.

# ఒంటరిపోరాటం

ప్రతి వక్త ప్రేక్షకులతో ఉపన్యసించడం "ఒంటరి పోరాటం" లాంటిదే. యుద్ధరంగంలో సైనికునికి ఎంత సంసిద్ధత కావాలో, ఎలాంటి నేర్పు కావాలో, ఎలాంటి మానసిక శిక్షణ ఉంటే జయం వరిస్తుందో, అలాగే ఒక వక్త సభికుల ముందు ఉపన్యసించడానికి సంసిద్ధతతో ఉండాలి. వక్త నోటినుంచి వెళ్ళిన మాటల తూటాలను వెనుకకు వేసుకోవడం కుదరదు కాబట్టి చాలా జాగరూకతతో వ్యవహరించాలి.

మాట్లాడబోయే అంశం గురించి ఎంత క్షుణ్ణంగా తెలుసుకుంటే అంత మంచిది. తెలిసిన విషయాన్ని ఎలా పొందికగా, క్రమబద్ధంగా మాట్లాడాలో ముందుగా నేర్చుకోవాల్సి ఉంటుంది. ఒంటరి పోరాటానికి వెళుతున్నట్లుగా భావించి పూర్తి సంసిద్ధతతో ఉపన్యాసాన్ని విజయవంతంగా కొనసాగించాలి.

*ఉపన్యాసారంభంలో వచ్చె చప్పట్లు వక్త మీద ఉన్న నమ్మకానికి, మధ్యలో వచ్చే చప్పట్లు మంచి ఆశలను రేకెత్తించేందుకు, అభినందనల సూచికగాను, ముగించిన తరువాత వచ్చే చప్పట్లు కేవలం ప్రేక్షకుల ధర్మంగా భావించాలి – అబ్రహం ఆర్. బెస్‌డిన్*

# కరఘోష

ఓ మహాకవి ఓ సందర్భంలో "చప్పట్లే సన్మాన దుప్పట్లు" అన్నట్లు ఈ చప్పట్లు వినినంతనే అర్థం చేసుకోవాల్సిన విషయాలు. ఏ సమయంలో కొడుతున్నారు? ఎందుకు కొడుతున్నారు? ఆ సమయంలో ఏమి చేయాలో తెలుసుకోవడం ఒక వక్తకు చాలా అవసరం. ఆ చప్పట్లు ఉపన్యాసం మొదలపెట్టడానికి ముందు అయితే ఆహ్వానపు చప్పట్లు అనీ, మధ్య మధ్యలో చెప్పిన విషయాలకు స్పందించి కొడితే అభినందన చప్పట్లు అనీ, ఇక ఘడియ, ఘడియకు కొడితే అవమాన చప్పట్లనీ, ఇక కొడుతూనే ఉంటే అర్థాంతరంగా నిష్క్రమించమని చెప్పే ఘాటు చప్పట్లనీ గమనించి జాగ్రత్తగా తగ్గట్టు వ్యవహరించడం ముఖ్యం.

ప్రతి స్పందిస్తూ అభినందన కరఘోషతో మార్మోగితే ఆ సమయంలో కొన్ని సెకండ్లు విశ్రాంతి తీసుకోవచ్చును. కొంతమంది వక్తలు ఎక్కడ చప్పట్లు పడతాయో పసిగట్టి అక్కడ "చప్పట్లు" అని వ్రాసుకొంటారని గమనించాలి.

# కృతజ్ఞతలు

వేదికపైనుండి మాట్లాడడానికి, ఆహూతులతో అనుభవాలను పంచుకోవడానికి ఆహ్వానించిన వారి పేరును, ఆహ్వానించిన సంస్థకు కృతజ్ఞతలు తెలుపడం చాలా ముఖ్యం. అయితే పొరపాటున కూడా ఉపన్యాస ప్రారంభంలో కృతజ్ఞతలు చెప్పకూడదు. కేవలం చివరిలో మాత్రమే చెప్పాలి. కృతజ్ఞతలు తెలుపడం మన సంస్కారానికి నిదర్శనం.

అయితే ఇక్కడ చాలా ముఖ్యమైన విషయాన్ని ఉపన్యాసకులు గుర్తు పెట్టుకోవాలి. కొందరు చివరిలో కృతజ్ఞతలను చెప్పేముందు వెనుకకు తిరిగి సంస్థ పేరును చూస్తూ చెప్పడం, సంస్థ నిర్వాహకుని పేరుని వేదిక మీద వారిని అడుగుతూ చెప్పడం ఆ సమయంలో చాలా తప్పు. కొందరైతే పూర్తిగా పేర్లను కూడా తప్పుగా చదువుతారు. ఇది ఉపన్యాసకుని హోదాను తగ్గిస్తుంది. కేవలం సభ పూర్తి అయిపోయే ముందు సంస్థపక్షాన వందన సమర్పణ తెలిపేవారు మాత్రమే కృతజ్ఞతతో మొదలు పెట్టాలి. కృతజ్ఞతలు చెప్పేవారు అంతవరకే పరిమితమై, మిగతా విషయాలను సమీక్షించకూడదు.

*ఏదైనా మాట్లేదయవచ్చును అనుకున్నవారు జీవితం మంచి వక్తగా ఎదగలేరు – ఫిన్లీ పీటర్‌డ్యున్*

# కంఠము

ప్రతి ఒక్కరు తమ కంఠాన్ని తాము ప్రేమించాలి. అలా అని తమ కంఠస్వరం కొన్ని సందర్భాల్లో బాగోలేకపోయినా, అనారోగ్యంతో అలసి, తిరిగి తిరిగి అతిగా మాట్లాడి కంఠం బొంగురుపోయినా తాము మాట్లాడడం మంచిదికాదు. అందు వలన వింటున్న వారికి, తమకు ఇబ్బంది కలుగుతుంది. అలాంటి సమయంలో మాట్లాడకపోవడం మంచిది. తప్పని పరిస్థితుల్లో మాట్లాడవలసి వస్తే 60 సెకండ్లలలో ముగించడం ఆరోగ్యం. కంఠస్వరం మరింత బాగా మెరుగుపరచుకోవడానికి కొన్ని సాధన పద్ధతులను నాటక రంగానికి సంబందించిన పాఠ్యప్రణాళికల్లో "వాయిస్ కల్చర్"గా వివరించబడుతుంది. వాటిని సాధన చేస్తే మన కంఠస్వరాలను మరింత మెరుగు పరుచుకోవచ్చును. గొప్ప సంగీత దర్శకులైన మహానుభావులు ఎస్.పి కోదండపాణి, కె.వి. మహదేవన్, రమేష్‌నాయుడు, ఏ.ఆర్. రెహ్మాన్‌లాంటి వారు ఎంతో ఆలోచించి తమ కంఠస్వరాన్ని ఎప్పుడు పాటలో ఉపయోగిస్తే బాగుంటుందో యోచించి చాకచక్యంగా వాడుకున్నారు. అంతేకాని ప్రతిసారి పాడలేదు. కంఠాన్ని జాగ్రత్తగా అవసరమైన మేరకు ఉపయోగించడం వక్తకు ఆరోగ్యకరం.

# కళ్ళ నియంత్రణ

ఓ ఉపన్యాసకుడి కళ్ళనియంత్రణ ఎంత వరకూ ఉండాలి?

ఉపన్యాస ప్రారంభంలో మాట్లాడానికి ముందుగా కనీసం ఓ నాలుగు సెకండ్లు (క్షణాలు) మీ కళ్ళతో కూర్చొని ఉన్న సభికులను చిరు మందహాసంతో కళ్ళతో పలకరించండి. వేదిక పైనుంచి వీలైనంతవరకు, చాలా సహజంగా 180 డిగ్రీలు చూడాలి. ఎట్టి పరిస్థితులలోను ఒకే వైపు చూస్తూ మిగతవారిని విస్మరించకూడదు. అయితే మీ చూపులను అంధకారంలోకి, శూన్యంలోకి చూస్తున్నట్లు కాకుండా సభికులను చూస్తున్నట్లుగా ఉండాలి. మిమ్ములను చూస్తూ వింటున్న ప్రతి సభికునికి వారి కోసమే మీరు ఉపన్యసిస్తున్నట్లుగా అనిపించాలి. ఈ సూత్రాన్ని తూచా తప్పక పాటించి కోట్లాది మంది అభిమానాన్ని సంపాదించుకున్న మహానటులు, అద్భుతమైన వక్త స్వర్గీయ డా॥ నందమూరి తారకరామారావు గారి తరువాతే ఎవరైనా.

*ప్రపంచంలో ఏ గాడిద కూడా మనుష్యులుగా మాట్లడం చూడలేదు, కాని కొందరు మనుషులు గాడదలాగ మాట్లాడం చూసాను – ఫ్యన్‌రిచ్ హ్యేనీ*

# గతి

మాట్లాడుతున్నప్పుడు ఉన్న స్వరగతి వేగానికి, ఉపన్యసించినపుడు ఉండాల్సిన వేగానికి చాలా వ్యత్యాసం ఉంటుంది. రెండూ ఒకేలా ఉండకూడదు. కొందరు వక్తలు చాలా హుషారుగా ఎక్కువ వేగంగా మాట్లాడడం, గ్రుక్కతిప్పు కోకుండా మాట్లాడడం అంటే అనర్గళ ప్రసంగం అనే భ్రమలో ఉంటారు.

అదేవిధంగా చాలా తాపీగా, నెమ్మదిగా ఉపన్యసించేవారి తీరు కూడా వినడానికి జనం ఇష్టపడరు. ఉపన్యసించేవారు పూర్తి వేగంగా కాక మరీ నెమ్మదిగా కాకుండా మధ్యస్థంగా మాట్లాడటం మంచిది. వక్తయొక్క స్వర గమన వేగం వినేవారికి, అర్థం చేసుకొని ఆకళింపు చేసుకొనే సమయాన్ని ఉపన్యాసకుడు ఇవ్వగలిగిననాడు వక్త సఫలీకృతుడౌతాడు.

# చిరుతిళ్ళు

ఉపన్యాసకులు ప్రసంగించే సమయంలో వక్కపొడి, మింట్, పిప్పరమెంట్, బబుల్‌గమ్, పాన్ లాంటివి నోటిలో లేకుండా చేసుకోవాలి. వాటివలన మీ నాలిక బండబారి పోవచ్చును. లేదా మాట మొద్దుగాను రావచ్చు లేదా మాట్లాడుతున్న సమయంలో ఆ మింట్ మీ నోటినించి క్రిందకు పడి ఇతరులకు కనువిందై ఇబ్బంది కలుగవచ్చును.

ఓ చక్కటి సభలో మీరు ఒక్కరూ నములుతున్నట్లుగానో, నెమరు వేస్తున్నట్లుగానో, తింటున్నట్లుగానో ఉన్న వీడియో చిత్రాన్ని తీసి మీకు చూపిస్తే మీమీద మీకే అసహ్యం కలుగుతుంది. మరి చూస్తున్న సభికులకి ఎలా ఉంటుందో ఒక్కసారి ఊహించండి.

*"అద్భుతంగా మొదలైన ఏ ఉపన్యాసమూ, చెడ్డగా ముగియలేదు"*

# చిరుదహాసం

ప్రేక్షకులను ఉపన్యాసానికి ముందుగానే పలకరించే విధానం - వారందరిని చూస్తూ ఓ చక్కటి చిరుదరహాసం. ఈ విధంగా చేసినట్లయితే అందరూ తమకు తెలియకుండానే వారి చిరుదరహాసంతో మీకు ప్రతిస్పందించి మీకు మానసికంగా దగ్గర అవుతారు. ఈ చిరుదరహాసం ఆరోగ్యకరమైన అంటువ్యాధి లాంటిది. మర్యాద వలె అసంకల్పితంగానే ఇచ్చి పుచ్చుకొనేది.

ఈ చిరుదరహాసం మీకు అందాన్ని ఇస్తుంది. మరికొంత ఆత్మస్థైర్యాన్ని ఇస్తుంది. మీరు గంభీరంగా ఉంటూ ఉపన్యసిస్తే వినే సభికులు కూడా గంభీరంగా వింటే ప్రతిస్పందనలు కరువు అవుతాయి. ఏదో తెలియని దూరం ఏర్పడుతుంది. చిరుదరహాసంతో జయించలేనిది లేదు అందుకు ఖర్చులేదు కాని జమ ఉంటుంది.

# నస

వక్త విషయాన్ని ఎంత శ్రద్ధతో చెబితే సభికులు అంత శ్రద్ధతోనే వింటారు. కాని కొందరు అతిశ్రద్ధతో చెప్పటం వలన అసలుకే ఎసరు పెట్టిన వాళ్ళవుతారు. దానికి కారణం ఒక విషయాన్ని అదే పనిగా చెబుతూ, చెప్పిన విషయాలనే మళ్ళీ మళ్ళీ చెబుతూ విసిగిస్తారు. బహుశా ఆ వక్త సృజనాత్మకంగా చెబుతున్నాని అనుకొని ఆ విషయంలో ఒక పరిశోధన చేసినట్లు, మరింత లోతుగా మాట్లాడి అందరినీ ఆకట్టుకోవాలనుకున్న తపన వింటున్న వాళ్ళకి కోపం నషాళానికి ఎక్కి తల పట్టుకుంటారు.

ఇలాంటి నసను ఇక భరించలేమంటూ అక్కడనుంచి త్వరితగతిన బయలుదేరి వెళ్ళిపోతారు. అందుచేత ఉపన్యాసకులు 'నసనారాయణులు'గా ముద్ర వేసుకోకుండా జాగ్రత్తగా మాట్లాడటం ముఖ్యం.

*"ఉపన్యాసం సూటిగా ఉండే బాణం కొనలా ఉండాలి"*

# నటించవద్దు

కొందరు వక్తలు కొన్నిసార్లు తమ సహజ నటనతో అమాయకంగా నటిస్తారు. కాని తెలివైన సభికులు గుర్తు పట్టగలరని గుర్తుంచుకోవాలి.

ముఖ్యంగా ఎపుడైతే ఉపన్యాసాన్ని కొనసాగించలేరో, ఎప్పుడైతే సరియైన పదాలు గుర్తురావో, ఎప్పుడైతే చెప్పాల్సిన విషయం మీద ఎక్కువ అవగాహన లేకుండా, మితిమీరిన ధైర్యంతో వేదిక ఎక్కి ఇబ్బంది పడతారో అప్పుడు పొడిదగ్గు దగ్గుతూ, లేని జలుబుని ప్రదర్శిస్తూ, కంఠం సరిగ్గా లేదని కంఠాన్ని సవరించుకుంటూ, గ్లాసులో నీళ్ళను పదే... పదే తాగుతూ తనకు మాట్లాడం ఇబ్బందిగా ఉందని దిగిపోతారు.

# నాడి

ప్రతి వక్త జనం ముందు అద్భుతంగా మాట్లాడాలని తయారుచేసుకొని వచ్చిన అంశాన్ని వినిపించాలనుకున్నా కొన్ని సందర్భాలలో ప్రేక్షకుల నాడిని గ్రహించి అందుకు తగ్గట్లుగా ప్రసంగించడం వలన అద్భుతమైన ప్రతిస్పందన వస్తుంది. ఆ తరువాత మళ్ళీ ఉపన్యాసకుడు చెప్పాల్సిన అంశాన్ని చెబితే జనం ఎంతసేపైనా వినడానికి సుముఖత చూపుతారు.

ఇది అనుభవపూర్వకంగా వస్తుంది. కాని ముందుగానే కొన్ని ప్రత్యామ్నాయ పద్ధతులను అవలంబిస్తే ఉపన్యసించే ముందు ఆ సభలో ఎలాంటి ఇబ్బందులు రావడానికి ఆస్కారముందో తెలుసుకొని ఆ సమయంలో జనం నాడి, వేడికి తగ్గట్లుగా ప్రసంగం కొనసాగించే తయారీ, సమయోచితాన్ని అలవరచుకోవాలి.

*ప్రేక్షకుల సమక్షంలో, ప్రేక్షకుల ప్రతిస్పందనతో, ప్రేక్షకులు పాలుపంచుకోని ఉపన్యాసం, ఒక వ్యక్తిగత సంభాషణ లాంటిది.*

# ◦ నిలబడే తీరు (స్థితి)

అన్నివేళలా  వక్త నిలబడడానికి వీలుగా ఉండే వీలైన బల్ల (పోడియం) ఉండకపోవచ్చును. అందుచేత నిలబడే విధానం చాలా ముఖ్యం. చాలా సహజం నిలబడాలి అంటే సాధారణంగా రెండు కాళ్ళ మధ్యన 15-20 అంగుళాల దూరం ఉండాలి. ఒక విగ్రహంలాగానో.. స్థూపంలాగా కాకుండా సహజంగా ఉండాలి. కొందరు ఒక కాలును కొద్దిగా వంచి ఇంకోకాలును నిటారుగా ఉంచి నృత్యభంగిమకు దగ్గరగా ఉండే విధంగా నిలుచుంటారు మరి కొందరు రెండుకాళ్ళు మధ్య దూరం దాదాపు ఒకటిన్నర రెండు అడుగులు  వుండటం వలన చాలా అసహ్యంగా ఉంటుంది.

మరి కొందరు మైకు వైపు వంగి వంకరగా నిలుచుంటారు. చాలా మంది పోడియం  ఉన్నట్లయితే చేతులు వాటిమీద ఆనించి లేదా చేరబడి మాట్లాడుతారు. ఇది కూడా సరియైన విధానం కాదు. సరియైన విధానంలో సహజంగా నిలబడితే మీరు ఎదుటివారికి చాల ఆత్మస్థైర్యంతో ఉన్నట్లు కనిపిస్తారు.

# నిశితవీక్షణం

ఉపన్యాసకుడిగా ప్రేక్షకుల బాహ్య కదలికలను గమనించడం వలన వాళ్ళు ఎంతవరకు ఆస్వాదిస్తున్నారో, ఎంతవరకు శ్రద్ధగా వింటున్నారో తెలుస్తుంది. ప్రేక్షకుల దరహాసాన్ని చూడడం, వాళ్ళు తలలు ఊపడం ద్వారా, వారి ఇష్టాన్ని ,చప్పట్ల ద్వారా అభినందిస్తున్న తీరుతో వక్తగా మరింత బాగా మాట్లాడటానికి ఉపకరిస్తుంది.

అలాగే మధ్య మధ్యలో లేచి వెళ్ళిపోవడం, ప్రక్కవాళ్ళతో మాటల్లో మునిగిపోవడం, ముందు కూర్చున్న అతిథులు ఏదో పొడిదగ్గు దగ్గుతూ, సెల్‌ఫోన్‌లో ఎవరో ఫోన్ చేసినట్లు సీరియస్‌గా వెళ్ళిపోతే ఉపన్యాసం ఎదుటివారిని ఆకట్టుకోవటం లేదని, ఆవేదనా భరితంగా ఉందని అర్థంచేసుకొని ఉపన్యాసాన్ని త్వరగా ముగించడానికి ప్రయత్నించాలి. ఈ నిశితవీక్షణం ప్రతీ వక్తకు చాలా అవసరం.

*గొప్ప వక్తలు ప్రజలను కళ్ళతో విని అర్థం చేసుకుంటారు.*

# పుస్తకాల పురుగులు

వక్తలు తయారుచేసుకున్న ఉపన్యాసం పూర్తిగా అవగాహనచేసుకొని ఎలా మాట్లాడాలో సాధనచేసి మాట్లాడడం చాలా ముఖ్యం (ఇక్కడ చాలా అనుభవజ్ఞులైన వక్తలను మినహాయిస్తే). తయారుచేసుకున్న ఉపన్యాసాన్ని పొల్లుపోకుండా చదవడం ఉపన్యాసం కాదు. పుస్తకంలోని భాషను యథాతథంగా మాట్లాడితే ఉపన్యాసం కాదు. తయారుచేసుకొన్న ఉపన్యాసాన్ని సరియైన, సరళమైన భాషలో అర్థవంతంగా మీ ఆంగికముతో, మీ ముఖకవళికలతో సభికులను చూస్తూ మాట్లాడం చాలా ముఖ్యం.

వ్రాసుకున్న ఉపన్యాసాన్ని చూస్తూ మాట్లాడం వలన మీ చూపు మీ వ్రాసుకున్న కాగితాలకే పరిమితమౌతుంది. భావప్రకటనకు అడ్డుగోడుగా నిలుస్తుంది. అందువలన వ్రాసుకున్న కాగితాలను ముందుపెట్టుకొని చదవటం కన్నా కేవలం కొన్ని ముఖ్యాంశాలను వ్రాసుకొని విశదీకరించడం ముఖ్యం.

# ప్రక్కదారి మళ్లించడం

అసలు విషయాలను అణుమాత్రమే స్పృశించి మెల్లగా వేరే విషయాలలోనికి దారి మళ్ళించడం వలన ఎక్కువ సభా సమయాన్ని వృధా చేసినట్లువుతుంది. వక్తలు అసలు విషయాలు ప్రక్కకు పెట్టి వేరే విషయాలను ప్రస్తుతించడం వలన సభికులు వేరే ఆలోచనలో పడిపోతారు. అసలు విషయమేమిటో అర్థంగాక గందరగోళానికి లోనవుతారు.

కాబట్టి మాట్లాడవలసిన అసలు విషయాలను ప్రక్కతోవ పట్టించడం వలన వక్త తనను తాను అవమానపరచుకోవడమే కాక వచ్చిన విజ్ఞులైన సభికులను కూడా విసిగించినట్లవుతుంది. అందుచేత అసలు విషయానికి సంబంధించిన విషయాలను క్షుణ్ణంగా వ్రాసుకొని అంతమేరకే మాట్లాడడం అవశ్యం.

*మాట్లాడవలసిన విషయం క్షుణ్ణంగా అర్థం చేసుకుంటే పదాలు అలవోకగా నోటి నుండి జాలువారుతాయి*

*– కేటోద ఎల్డర్ (234– క్రీ.పూ)*

# ప్రేరణ

జనం ఉపన్యాసకుల నుంచి ప్రేరణ పొందడానికి వస్తారు. అందుచేత వక్త కేవలం విషయ పరిజ్ఞానానికి మాత్రమే పరిమితి కాకుండా ఆ విషయం ద్వారా ఏ విధంగా వింటున్న ప్రజలను ప్రేరేపిస్తున్నాడో, ఎలా ప్రభావితం చేస్తున్నాడో వక్త మాట్లాడే 'శైలికి' నిదర్శనంగా నిలుస్తుంది. వక్తలు ప్రేరణ కలిగించడానికి అనుగుణంగా అంశాల ఎంపిక, వినిపించాల్సిన విధానం, వివరించాల్సిన అంశాలను తన అంబులపొదిలో ఉంచుకొని, సరియైన రీతిలో తనదైన పంథాలో ప్రజలలో ప్రేరణ కలిగించాలి.

ప్రేరణ కలిగించని ఉపన్యాసం ఒక వార్తాపఠనం లాంటిది, కాబట్టి ఎంతో మందిని ఒకేసారి ప్రేరణ కల్పించడం ఓ గొప్ప వరంగా భావించి దానికి అనుగుణంగా ఉపన్యసించడం భావ్యం.

# భయం

ఉపన్యసించే ముందు భయం ఉండడం సర్వ సాధారణమే. దానికి కారణం ఉపన్యాసం బాగా రావాలనే కోరిక. ఈ అంతర్మథనం ప్రతీ వక్తకూ చాలా ముఖ్యం. ప్రతీ ఉపన్యాసాన్ని మొదటిసారి మాట్లాడుతున్నంత జాగ్రత్త తీసుకోవాలి. ఎందుకంటే ఆసీనులైన సభికుల్లో వారికి మీరు మొదటసారి కావచ్చును, లేదా మీకు వారు మొదటిసారి కావచ్చును.

తొలి చూపులోనే అన్నట్లుగా మీ తొలి ప్రసంగం అనుకొని అద్భుతంగా మాట్లాడగలిగితే అనంతం గుర్తు ఉండిపోతుంది, లేదా అనంతవాయువుల్లో కలిసిపోతుంది. ఒలంపిక్స్‌లో పరుగిడే విశ్వవిజేతకు కూడా పరుగుపందెంలో ట్రాక్‌మీద నిలబడినప్పుడు భయం ఉంటుంది. కాని దానిని జయించి విజయఢంకా మ్రోగించడంపైనే ఆ సమయంలో దృష్టిని కేంద్రీకరించాలి.

"సింపెథిటిక్ నర్వెస్ సిస్టమ్" శరీరంలోని ఒక కేంద్ర నాడీమండలం భయాన్ని ఎదుర్కొనే ముందుమనల్ని సంసిద్ధుల్ని చేస్తుంది. ఇది చాలా సహజాతమైనది. మనకు తెలియని ఏ క్రొత్తవిషయం మీద మాట్లాడవలసి వచ్చినా "భయం" కలగడం సహజమని గుర్తించాలి

# మందకొడి

విచ్చేసిన సభికులు వక్త ఉపన్యాసం ద్వారా ఎన్నో విషయాలు విని ఉత్సాహంగా నేర్చుకొందామని వస్తారు. అలాంటి ఉత్సాహాన్ని నీరుగార్చే మందకొడి ఉపన్యాసాలను గావించడం కంటే ఉపన్యసించకపోవడం ఉత్తమం. మందకొడి ఉపన్యాసాన్ని ప్రేక్షకులు మెచ్చరు. త్రిప్పికొడతారు.

మందకొడిగా సాగే ఏ ఉపన్యాసమైన భరించడం చాలా కష్టం. వక్తలు సభికుల సహనాన్ని పరీక్షించడం భావ్యం కాదు. మందకొడి ఉపన్యాసాలు చేసే వక్తలను ప్రజలు అక్కడే వారిని చప్పట్లతో, ఈలలతో తిరస్కరిస్తారని గుర్తుపెట్టుకోవాలి. ఎంత గొప్పవారైనా మందకొడిగా ఉపన్యసిస్తే ప్రేక్షకులు ఉపేక్షించరు.

# 'మైకా'సురులు

వేదిక మీదనున్న మైకులను గట్టిగా పట్టుకొని విడువని అసురులే మైకాసురులు అని ఓ సందర్భంలో ఓ ప్రముఖ వక్త ఛలోక్తి విసిరారు. వక్తలు మైకులను పట్టుకోవడం వలన భావానికి తగ్గట్లు చేతి కదలికలు లేక పేలవంగా ఉంటుంది. మైక్రోఫోనుకు కనీసం 4-6 అంగుళాల దూరంలో గడ్డం క్రింద మైక్ ఉండేలా చూసుకోవాలి.

అపుడే మాట్లాడుతున్నప్పుడు వక్త యొక్క ముఖ కవళికలు అందరికీ కనబడతాయి. లేని యెడల మైక్రోఫోన్ వక్త యొక్క ముఖంలో 40 శాతాన్ని కనబడకుండా చేస్తుంది. మైకులను మాట్లాడే ముందుగా ఎవరికివారు తమకు ఎలా వీలుగా ఉంటుందో చూసి అమర్చుకోవాలి. దీనికి 5-10 సెకండ్ల కంటే ఎక్కువ సమయం పట్టదు అని గమనించాలి.

*"ఉపన్యాసం అనేది యుద్ధం లాంటిది, సుక్షితులుగా వెళితే తప్ప జయించడం అంత తేలికైన పనికాదు"*

# మర్యాద క్రమము

ఉపన్యసించే ముందు, ఉపన్యసిస్తున్నప్పుడు ఉపన్యాస ముగింపులు ఎలా ఉండాలో, ఏమి చేయాలో వక్తలు తెలుసుకోవాలి. ఉపన్యాసానికి ముందు అంతకు మునుపు ఉపన్యసించిన వక్త గురించి పొగడటం, లేదా మిమ్ములను పరిచయం చేసిన వ్యక్తికి కృతజ్ఞతలు చెప్పడం, మిమ్ములను ఆహ్వానించిన వారి గురించి ముందుగా కృతజ్ఞతా ప్రశంసలు కురిపించడం, అందరి ముందు చేతి రుమాలుతో తుడుచుకోవడం, చప్పుడు చేస్తూ గడగడ మంచినీళ్ళు త్రాగడం, జేబుల్లో వెతుక్కోవడం చేయకూడదు.

ఉపన్యసిస్తున్నప్పుడు మధ్య మధ్యలో వేదికవైపునున్న వారిని పదేపదే చూడటం, సభికుల్లో తెలిసిన వారుంటే వారివైపే చూసి మాట్లాడడం, మధ్యలో పెద్దగా నవ్వుతూ తనకు నవ్వు తెచ్చిన విషయాన్ని చెప్పడం కూడదు. ముగింపులో మళ్ళీ కృతజ్ఞతలు తెలుపడం, అందరి పేర్లను ప్రస్తుతిస్తూ వారి గొప్పతనాలు ప్రజలకు చెబుతూ ముగించడం, సక్రమమైన పద్ధతి కాదు.

# ముగింపు

ఆరంభానికి ఎంత ప్రాధాన్యత ఉందో అంతే ప్రాధాన్యత ముగింపుకూ అవసరం. ఉపన్యాసం ముగింపులో వక్త తానంతవరకూ మాట్లాడిన విషయాలు అత్యంత సంక్షిప్తంగా గుర్తు తెస్తూ మరోసారి వాటిని ప్రస్తుతించి తరువాతి కార్యాచరణ చెప్పవచ్చును. ఒక పాట ఎంత అందంగా మొదలవుతుందో అంతే అందంగా ముగింపు ఉంటుంది.

అలాగే ఉపన్యాసకుడు ఎంతో జాగ్రత్తగా, ఎంత అర్థవంతంగా తన ఉపన్యాసాన్ని మొదలు పెడతాడో అంతే అర్థవంతంగా ముగించేలా ప్రణాళిక వేసుకోవాలి. ఉపన్యాస ముగింపులో మాట్లాడిన పలుకులు తీయని తలపులుగా మదిలో నిండిపోయినపుడే వక్త ఉపన్యాస పటిమ అర్థమౌతుంది.

*"వక్తలు బాగా వెలిగిపోవాలని ఆశిస్తే దానికి తగ్గట్టు సూర్యునిలా మండటానికి సిద్ధపడాలి"*

# మొబైల్ నియంత్రణ

ఈ శతాబ్దపు అత్యుత్తమ ఉపయోగకరమైన సాధనం. దానిని ఉపన్యసించినపుడు మాత్రం త్యజించండి. ఉపన్యసించే సమయంలో ఫోన్‌లో మాట్లాడడం వింటున్న సభికులను అవమానపరచడమే. అదే పనిగా కూర్చొన్న ప్రేక్షకులలో ఓ పదిమంది మీరు ఉపన్యసిస్తున్న సమయంలో గట్టిగా ఫోను మాట్లాడుతుంటే మీకెలా అనిపిస్తుందో ఒక్కసారి ఆలోచిస్తే మళ్ళీ అలా చేయకూడదు అనిపిస్తుంది.

ఒక వేళ అత్యవసరమైతే వేరే మిత్రుడుకి ఇవ్వడమో లేదా తరువాత మాట్లాడడమో చేయాలి. నిజానికి చాలామంది మొబైల్‌ని ఉపయోగించే తీరు తెలియక చాలామందిని ఇబ్బంది పెడుతున్నారు. అన్నింటి కన్నా ముఖ్య విషయం మీరు ఉపన్యసిస్తున్నప్పుడు మీ ఏకాగ్రతకి, ఉపన్యాస ధారకి ఈ మొబైల్ అడ్డురాకుండా దానిని మీ దగ్గర ఉంచుకోకుండా జాగ్రత్త పడాలి.

# మౌనం

ఉపన్యాసం మొదలు పెట్టేముందు వక్త వేదికపై నిలుచొని కనీసం మూడు నుంచి అయిదు సెకెండ్ల చిరు దరహాసంతో మౌనంగా అందరినీ పలకరించితే విచ్చేసిన సభికులు కూడా అంతే మౌనంగా పలకరిస్తారు. ఎప్పుడైతే ప్రేక్షకులు ఆనందించి తమ చప్పట్లతో ప్రతిస్పందిస్తారో అప్పుడు కాసేపు మౌనంగా ఆనందించాలి. వక్త సభికులకు ఏదైనా ప్రశ్నను సంధించితే... కాసేపు మౌనంగా ఉండటం ద్వారా ప్రేక్షకులు ప్రతిస్పందించడానికి అవకాశం ఇచ్చినట్లవుతుంది.

ఒకోసారి ప్రేక్షకులలోంచి కొంతమంది గట్టిగా అరవడం చేసినపుడు ఒక్కసారి మౌనంగా 3 సెకెండ్లు అటువైపు చూడడం వలన అవతలవ్యక్తి మళ్ళీ అలాంటి చర్యకు ఉపక్రమించకుండా చుట్టూ ప్రక్కనున్న వారు అలా చేసిన వారిని వారిస్తారు.

*"ఉపన్యాసానికి ముందు నీ గుండె దడగా ఉందనిపిస్తే నీవు దాని గురించి చాలా తీవ్రంగా ఆలోచిస్తున్నావని అర్థం."*

# యదార్ధం

వక్త గొప్పతనం ఇనుమడింపజేయడానికి ఉపయోగపడే అంశం 'యదార్ధం'. ప్రేక్షకులు నిజాన్ని వినాలని కోరుకుంటారు. అయితే యదార్థాన్ని ఎంత జాగ్రత్తగా, ఎంతవరకు, ఎలా చెప్పాలో వక్తకు తెలిసుండాలి. తప్పుడు సమాచారాన్ని, తప్పుడు గణాంకాలను వేదికపై నుండి చెప్పడం వలన తాను జవాబుదారి వహించాల్సి ఉంటుంది. వక్తలు చిక్కులలో పడి అభాసు పాలవుతారు.

అందుచేత వీలైనంత వరకు తాను ఉపన్యసించబోయే విషయాలను ఒకటికి రెండుసార్లు సరిచూసుకోవాలి. ఉదాహరణకు : కొన్ని సుభాషితాలను, పద్యాలను, ఒకరు అన్న మాటలను ఇంకొకరు చెప్పినట్లుగా చెప్పడం, ఒక సందర్భంలో మాట్లాడితే వేరే సందర్భంగా మాట్లాడినట్లు చెప్పడం, లేనివి సృష్టించి - ఎక్కడో జరిగినట్లు, తాను విన్నట్లు వారు అన్నట్లు చెప్పడం లాంటివి చేయకూడదు.

# వందన దండకము

వక్తలు ఉపన్యాస ఆరంభంలో చేయకూడని పొరపాట్లు. ముందుగా వేదికపై ఆసీనులైన వారిలో మొదట సభాధ్యక్షులను తరువాత ముఖ్య అతిథిని, ఆ తరువాత క్రమంలో మిగతా అతిథులను ఉద్దేశించి ప్రసంగాన్ని మొదలుపెట్టాలి. ఒకవేళ మిగిలిన అతిథుల సంఖ్య ముగ్గురు లేదా నలుగురు మాత్రమే ఉంటే వారి పేర్లను కూడా ప్రస్తుతించవచ్చును.

వేదికపై ఒకే సారి 10-20 మంది ఉన్నట్లయితే సభాధ్యక్షులవారిని, ముఖ్య అతిథిని ప్రస్తుతించి మిగతావారిని ఒకే మాటతో, ‘‘సభ నలంకరించిన పెద్దలందరికీ నమస్కారం’ అని మొదలుపెట్టవచ్చును. 10-20 మంది పేర్లను వచ్చిన ప్రతి వక్త చదివినట్లయితే సమయం వృధా, సభికులకు వ్యధ కలిగించినట్లవుతుంది.

ఈ వందన దండకము (Salutations) ఎలా ఉండాలో తెలియక అయోమయ స్థితిలో 8 నిమిషాలు అందరికీ కేటాయించి అసలు విషయం 2 నిమిషాలు మాట్లాడి దిగిపోయినవారూ ఉన్నారు.

*“ఉపన్యాసం అద్భుతంగా ఉండాలనుకుంటే సాధన చేయాల్సినవి ముచ్చటగా మూడు – తయారు చేసుకోవడం, అద్దం ముందు చూస్తూ సాధన చేయడం, తరువాత ఉపన్యసించడం (ప్రదర్శన)”*

# వ్యక్తీకరణ

ఉపన్యాసకునిగా అభిప్రాయాలను వ్యక్తీకరించుట వరకే పరిమితం చేసుకోవాలి కానీ ఇతరుల అభీష్టాలను వక్రీకరించ కూడదు. ఎదుటి వారి సంస్కృతిని, మనో భావాలను దెబ్బతీసే విధంగాగాని తాము చెప్పినవే విలువైనవని, మిగతా సంస్కృతులను నమ్మవలసిన అవసరం లేదనే భావనను, స్వంత అభిప్రాయాలను ఎదుటవారి మీద రుద్దే ప్రయత్నాలను మానుకోవాలి.

ఇలాంటి సందర్భంలో సంఘర్షణలు, ఘర్షణలు చోటుచేసుకొనే అవకాశం ఉంటుంది. కాబట్టి అతి జాగ్రత్తగా మెదలుకోవడం ముఖ్యం.

# విసిగించటం

కొందరు వక్తలు ఉపన్యాసప్రారంభంలోనే అతి వినయంగా "మిమ్ములను ఎక్కువగా విసిగించను" అనే మాటతో మొదలుపెట్టి వినేవాళ్ళను ముందుగానే భరించడానికి తయారు కావల్సిందిగా సూచిస్తారు. పొరపాటున కూడా ఇలా చెయ్యడం మంచిది కాదు. మరికొందరు ఉపన్యాసం ఎలా పూర్తి చెయ్యాలో తెలియదు కాబట్టి ఇక మిమ్ములను విసిగించదలచుకోలేదు అని అర్థాంతరంగా ముగిస్తారు. ఇలా ముగించడం కూడా విసిగించడమే.

విసిగించను అని పలుమార్లు చెబుతూ ఉపన్యాసాన్ని కొనసాగించడం కూడా విసిగించడమే. మరి కొద్దిసేపట్లో ముగిస్తాను అని అంటూ ముగించకుండా... ఇంకా ఎప్పుడు మాకు మోక్షం అని సభికులు అనుకోవడం కూడా విసిగించడమే. వక్తలు ఇలా సామూహిక హింసలకు తావివ్వకూడదని గుర్తు పెట్టుకోవాలి.

*"ఉపన్యసించే ముందు "భయం" ప్రతి వక్తలోను ఉంటుంది, దానిని ప్రదర్శించకుండా మాట్లాడటమే ఒక కళ."*

# విమర్శలు

ఉపన్యాసకులు విమర్శించడం కంటే సద్విమర్శలు చేయడం వలన వక్తను కొనియాడుతారు లేదంటే తూలనాడుతారు. సద్విమర్శ ఎప్పుడు ఆరోగ్యకరమే. "సత్యం ఎపుడూ అప్రియం" గానే ఉంటుంది. కాని వివేకవంతులైన వక్తలు ఆ సత్యాని ఎలా చెబితే బాగుంటుందో అలాంటి మార్గాన్ని ఎంచుకొని సద్విమర్శ చేస్తారు. మరికొందరు నేను ఏదైనా ఉన్నది ఉన్నట్లుగానే చెబుతాను అని వేదికమీదే ఎదురు దాడికి దిగిన వాళ్ళు, కొన్ని సందర్భాల్లో అభాసుపాలైన వారు, అవమానంతో వెళ్ళినవారూ ఉన్నారు.

వీలైనంత వరకు వేదికపైనున్న మిగిలిన వక్తలను విమర్శించక పోవడం సభా గౌరవాన్ని ఇనుమడింపజేసినట్లవు తుంది. వీటిని పాటించక ఎన్నో రాజకీయ సభలు రసాభాసగా మారి ప్రజల చేత అగౌరవ కిరీటాన్ని తొడిగించుకుంటాయి.

# శృతిమించటం

సభలో ఎంతమంది ఉన్నా ఆధునీకరణ మూలాన మనం మాట్లాడే మాటలు కొన్ని వందల రెట్ల శబ్దంతో ఎంత మందికైనా వినబడే సౌలభ్యత ఉంది. అయినా పెద్దగా మాట్లాడటం (స్వర శృతి మించి మాట్లాడం) వలన వినే ప్రేక్షకులకు చాలా ఇబ్బందిగా ఉంటుంది. బాగా వినబడడానికి (సౌండ్ వాల్యుం) ధ్వని తరంగధైర్ఘ్యం పెంచమనాలి కాని మన గొంతు పెంచి అరచినట్లుగా మాట్లాడకూడదు.

ఒక లాలిపాటైన, జోల పాటైన, ఒక యుగళగీతమైన, ఒక ప్రబోధగీతమైన మనం విన్నప్పుడు పెద్దగా వినబడడానికి (సౌండ్ వాల్యూమ్) ఎలా పెంచమని అడుగుతావో గుర్తుంచుకోండి. మీ గొంతు అవసరానికి మించి పలికితే అరచినట్లుగా ఉంటుందే తప్ప మంచి ఉపన్యాసం విన్నట్లుగా ఉండదు. ఎక్కువ శాతం రాజకీయ ఉపన్యాసాలు శృతి మించి ఉంటాయి. వాటిని అనుకరించకూడదనేది ముఖ్యసారాశం.

*"భయం" సర్వసాధారణమైనది, మాట్లాడేముందు "భయం" అనిపిస్తుందని అంటే దాని గురించి వక్త చాలా తీవ్రంగా ఆలోచించి, మదనపడుతున్నాడని అర్థం"*

# స్వర స్థాయి

ఉపన్యాస ప్రవాహ వేగాన్ని సందర్భానుసారం నియంత్రించడం చాలా ముఖ్యం. ఆవేశపూరితమైన, స్ఫూర్తి దాయకమైన ఉపన్యాసాలు ఇస్తున్నప్పుడు కొంతవరకు తారాస్థాయిలోను, మంచి విషయాలను, విజ్ఞాన, ఆధ్యాత్మిక ఉపన్యాసాలను మధ్యమ స్వర స్థాయిలోను, శోచనీయమైన అవాంఛనీయమైన అంశాలను ఉపన్యసించినపుడు మంద్ర స్థాయిలోను ఉపన్యసించడం బాగుంటుంది..

హావభావాలకు తగ్గట్టు స్వరస్థాయి హెచ్చుతగ్గులను నియంత్రించుకొని ఉపన్యసించడం వక్తలు దృష్టిలో పెట్టుకోవాల్సిన ముఖ్యాంశం. స్వరస్థాయిలో హెచ్చుతగ్గులు వినిపించకపోతే ఉపన్యాసం పేలవంతంగా ఉంటుంది. అందువలన సరియైన హృదయస్పందనలను తెలియ జేయడం కుదరకపోవచ్చు.

# స్వల్ప విరామం

ఉపన్యసించే సమయంలో వాక్యాల నడుమ, అపుడప్పుడు కొన్ని పదాల నడుమ సహజంగా ఇవ్వాల్సినంత విరామం ఇవ్వకపోతే సరియైన అర్థం పలకదు. ఒకవేళ వక్త ఇవ్వాల్సిన విరామం కంటే ఎక్కువ విరామం ఇచ్చినట్లయితే పూర్తి అర్థం మారిపోవడమో, అనుమానం రావడమో, అయోమయంలో పడటమో జరుగుతుంది. ఎక్కువ విరామం ఇస్తూ మాట్లాడే వక్తలను జనం అంతగా ఇష్టపడరు. అసహనంతో వినడం మానేస్తారు.

అయితే అపుడపుడు చాకచక్యంగా, సరదాగా, ఉత్సుకతను రేకెత్తించాలనిపించినా అసలు విషయానికి తెర దించాలనుకున్నా స్వల్ప విరామంతో వక్త సమయానుకూలంగా జిమ్మిక్కులు చేయవచ్చు. స్వల్పవిరామం భాషకు, ఉపన్యసించే తీరుకు వన్నె తెస్తుంది.

# స్థబ్ధ ఛేదన

ఆహూతులైన సభకుల్లో ఎన్నో ఆలోచనలు, ఎన్నో పనులు, ఎన్నెన్నో విషయాలు వారిని ఆవహించి ఉంటాయి. ఇన్నింటి మధ్యలో ఉన్న స్థబ్ధతను ఛేదించడం ఉపన్యాసకుడికి ఒక పెద్ద సవాలు. అందుచేత వక్త వాటిని ఛేదించి 'తనకు - సభికులకి'' మధ్య అతి తక్కువ సమయంలో వారధి నిర్మించుకోవడానికి మానసికంగా తయారు కావాలి.

ఎలాంటి అంశాలు ముందు కూర్చొని ఉన్న సభికులను తనవైపు వినేటట్లు చేస్తాయో, ఎలాంటి విషయాలతో ఆకర్షించగలడో అలాంటి విషయాలను ప్రస్తుతిస్తూ ముందుకు వెళ్ళాలి. అప్పుడే ఉపన్యాసం సరియైన రీతిలో జనంలోకి వెళ్తుంది. స్థబ్ధతను ఛేదించకుండా సరాసరి అసలు విషయానికి రావడం అంత ఇంపుగా ఉండదు.

# స్వోత్కర్ష

ఉపన్యసిస్తున్నప్పుడు అవసరమైన మోతాదుకు మించి తమ గురించి తాము చెప్పుకోవడం చాలా ఎబ్బెట్టుగా ఉంటుంది. వక్త పరిచయాన్ని కార్యనిర్వాహకులు (వ్యాఖ్యాత) ముందుగానే చేస్తారు కావున మళ్ళీ చెప్పుకోవాల్సిన అవసరం రాకూడదు.

కొంతమంది అదే అదనుగా సొంత డబ్బాకొట్టి మాట్లాడే ప్రతి విషయంలో తామూ ఉన్నామనే భ్రమ కలిగించడానికి వీలైనన్ని సార్లు తాము ఆ సందర్భంలో అలా చేశామని, ఇలా చేశామని మాట్లాడి తాను చెప్పవలసిన అంశంలో తమను తామే పోల్చుకుంటూ అసలు విషయాన్ని సరిగ్గా చెప్పలేక అభాసుపాలు అవుతారు. అందుచేత స్వోత్కర్ష చాలా ప్రమాదం. మాట్లాడకపోవడం ప్రమోదం.

*"ప్రజల హృదయస్పందనలు కావాలి అనుకుంటే, వక్తలు హృదయంతో మాట్లాడాలి కాని పెదవులతో కాదు"*

# సవరించుకోవడం

కొందరు వక్తలు తమకు తెలియకుండా చేసే పనులు కూర్చొన్న సభికులకు కనువిందు చేసాయి. 'తస్మాత్ జాగ్రత్త'. వాళ్ళు ఇక మిమ్ములను మీ చేష్టలను లెక్కపెట్టడం మొదలు పెడతారు.

కొందరు జేబుల్లో నిండుగా చిన్న డైరీలను, కాగితాలను, కళ్లద్దాలను చిల్లరను నింపుకొని రావడం. అపుడపుడు తీసినపుడు క్రిందపడడం లేదా కళ్ళజోడును ప్రతీసారి తుడుచుకోవడం, గుండీలను లాగడం లేదా పట్టుకోవడం, బెల్టును ప్రతీసారీ సవరించుకోవడం, సెల్‌ఫోను ఆ జేబులోంచి ఈ జేబులోకి మార్చడం, పెన్నును చేతితో పట్టుకుని టక్-టక్ మనే శబ్దం చేస్తూ మాట్లాడం, ప్రతీసారి కళ్ళజోడును జారిపోతే నొక్కుతున్నట్లు, బొట్టు పెట్టుకున్నట్లు పదే పదే అనడం జరుగుతుంది. ప్రేక్షకులు అన్నీ గమనిస్తుంటారని మర్చిపోవద్దు, అనవసరంగా వారి దృష్టి మరల్చడం మంచిదికాదు.

# సంక్షిప్తత

వక్త సమయాన్ని దృష్టిలో పెట్టుకొని మాట్లాడబోయే విషయాన్ని సంక్షిప్తంగా ముగించడానికి కావల్సిన ముఖ్యమైన ఆరు అంశాలు. ఈ విషయాన్ని 1 ఏనుగు 5 ఎలుకలు అని గుర్తుపెట్టుకోండి 1. అసలు విషయం ఏమిటి? 2. ఎందుకు? 3. ఎలా? 4. ఎవరు? 5. ఎక్కడ 6. ఎప్పుడు అనే - విషయాలను ఉపన్యాసకుడు వివరిస్తూ ఉపన్యాసాన్ని కొనసాగిండం ద్వారా పూర్తి విషయాలను మీ ఉపన్యాసం ద్వారా సంక్షిప్తంగా అద్భుతంగా అందించగలుగుతారు.

అందుకే ఆంగ్లంలో K.I.S.S. (Keep it short and sweet) అన్నారు. ఇంకా కాసేపు వక్త మాట్లాడితే బాగుణ్ణు అనే సమయంలోనే ఉపన్యాసాన్ని ముగించడం వలన వక్తపై ప్రశంసల జల్లు కురుస్తుంది.

# సమయపాలన

వక్తలు పాటించాల్సిన క్రమశిక్షణ సమయపాలన నూటికి 70 శాతం వక్తలు పాటించరనే విషయాన్ని ఇటీవల ఒక సర్వేలో తెలిపారు. దానికి గల ప్రత్యేక కారణాలు ఉపన్యాసాన్ని సరిగ్గా తయారుచేసుకోకపోవడం, ఏం మాట్లాడాలో, ఎంత మాట్లాడాలో, ఎలా మాట్లాడాలో తెలియక ఎదుటివారి సమయాన్ని తేలిగ్గా తీసుకోవడం, ఎదుటి వారిచ్చిన సమయాన్ని గౌరవించకపోవడం.

ఇచ్చిన సమయంలో ముగించే వక్తలు కొంతమంది మాత్రమే. ప్రతీసారి సమయాన్ని పొడిగించమని అడిగేవారిదే ఎక్కువసంఖ్య. ఇచ్చిన సమయంలో మాట్లాడలేక ముగించేవారు బహు కొద్దిమంది అయితే సమయాన్ని ఉపయోగించుకోకపోవడం అవివేకం అని తెలుసుకోవాలి. మాట్లాడవలసిన వక్తలు విచ్చేసిన సభికుల సమయాన్ని వృధా చేయడం సబబుకాదు. ఉదాహరణకు 500 మంది వింటున్నపుడు 5 నిమిషాలు ఎక్కువ మాట్లాడితే 1800 నిమిషాలు అంటే 30 గంటల సమయాన్ని వృధా చేయడమే. అద్భుతంగా మాట్లాడే వక్తలు కూడా ఒకోసారి సమయాన్ని దృష్టిలో పెట్టుకోకపోవడం వలన అందరికీ అలుసైపోతారు.

# హాస్యం

ఉపన్యాసంలో హాస్యం అక్కడక్కడ సందర్భోచితంగా ఉండాల్సిందే. దానివలన సభికులలో ఆసక్తితోపాటు వక్త ప్రసంగాన్ని మరింత ఆస్వాదించటానికి ఇష్టపడతారు. వక్త ఉపన్యాసాన్ని ఇచ్చేముందు వ్రాసుకున్న ముఖ్యాంశాలలో ఎక్కడ హాస్యాన్ని వాడాలో వ్రాసుకుంటే మంచిది. కాకలుదీరిన వక్తలు హాస్యాన్ని సమయస్ఫూర్తితో అందిస్తున్న విషయం మనకు తెలిసిందే.

ప్రతీ వక్త వీలైనంత వరకు తాము చెప్పబోయే విషయాల్లో ఎక్కడ హాస్యాన్ని ఇమడ్చగలమో ఆలోచించడం వలన చక్కటి ఆరోగ్యకరమైన హాస్యం పడుతుంది. మోతాదుకు మించిన హాస్యము అపహాస్యం అవుతుందని వేరేగా చెప్పాల్సిన అవసరం లేదు. అతి ప్రధానమైన హాస్యం జాగ్రత్తగా వాడడం ఎంతో అవసరం.

# క్షమాపణ

అతివినయం కొంపను ముంచుతుంది. మరింత కోపాన్ని తెప్పిస్తుంది. కొందరు ఉపన్యాసకులు ఆలస్యంగా రావడంతోపాటు అడగకుండానే ఉపన్యాసం ప్రారంభంలోనే అతి వినియంగా ఆలస్యానికి కారణాలను వివరిస్తూ సంజాయిషి ఇస్తుంటారు. ఇది ఏమాత్రం సబబుకాదు సరికాదా వినబోయే సభికుల అసహనానికి ఆజ్యం పోసినట్లువుతుంది.

క్షమాపణ కోరటం చాలా సరియైన విధానం అయినా ముందుగా కోరటం కంటే ఉపన్యాసం ముగించే ముందు చెప్పటం వలన ప్రజలు ఓ చిరునవ్వుతో క్షమిస్తారు. తప్పును వినయంగా ఒప్పుకున్నందుకు గౌరవిస్తారు.

సభలో ప్రసంగించేటప్పుడు పొరపాటున ఏదైనా విషయం తప్పుగా చెప్పినా, తప్పుగా ఉదహరించినా తేరుకొని క్షమాపణ చెప్పడం, ఎవరైనా తప్పును నిజంగా సరిదిద్దితే క్షమాపణలు కోరటం సంస్కారం.

# రచయిత

గత 30 సంవత్సరాలుగా ఎన్నో వందలఉపన్యాసాలు చేసి శిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్న శ్రీ జి.వి.ఎన్. రాజు కేంద్ర ప్రభుత్వంలో పనిచేసి స్వచ్ఛంద పదవీ విరమణ గావించి, తరువాత అంతర్జాతీయ బహుళజాతి కంపెనీలలో పెద్ద హెూదాలలో పనిచేసిన అనుభవం కలదు.

వివిధ పత్రికల్లో కొంతకాలం పాటు వ్యాసాలు వ్రాశారు. ఆకాశవాణి, టీవీల్లో విభిన్నమైన కార్యక్రమాలలో గత 25 ఏళ్ళుగా పాల్గొంటున్నారు. సాంస్కృతిక రంగంలో ధ్వన్యనుకరణ కళాకారుడిగా, వెంట్రిలోక్విస్టగా సరికొత్త ప్రపంచ రికార్డ్సు నెలకొల్పారు. తెలుగువారి ఆహ్వానం మేరకు అమెరికా, కెనడా, నేపాల్, థాయిలేండ్ మరియు చైనా దేశాల్లో ప్రదర్శనలు ఇచ్చారు.

వ్యక్తిత్వ వికాస నిపుణుడిగా కొన్ని వందలశిక్షణా శిబిరాలను నిర్వహించారు. ప్రభుత్వరంగ సంస్థలైన తపాలా జీవితభీమా, జీవితభీమా సంస్థ, పోలీసు అకాడమీ, పోలీస్ ట్రైనింగ్ కాలేజ్, డా॥ మర్రి చెన్నారెడ్డి మానవ వనరులఅభివృద్ధి సంస్థలో, బ్యాంకింగ్ రంగాలవారికి, మార్కెటింగ్ రంగాలవారికి, అధ్యాపకులశిక్షణా శిబిరాలు, ఉపన్యాస శిక్షణా శిబిరాలు, ఆయా రంగాలకు తగినట్లు శిక్షణాంశాలను తయారుచేసి వారిలోని నైపుణ్యానికి పదునుపెట్టి ఆత్మస్థైర్యంతో, అభివృద్ధి పథంలోకి నడిపే మార్గదర్శకులుగా తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు.

